Follow: @ANNTELUGU
ANN తెలుగు
23-06-2025
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 200 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## రప్పారప్పా దేనికి?
- తెలంగాణను ఏం చేయాలనుకుంటున్నారు?
- శాంతిభద్రతలపై కుట్రచేస్తున్నారా?
- బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి ఫుల్ ఫైర్



02

## వరంగల్ నేతల వ్యవహారాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాం
- క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ మల్లు రవి
- మీనాక్షి నటరాజన్‌తో చర్చించి కార్యాచరణ



02

## దామోదర రాజనరసింహ పేరుతో సినిమా తీయాలని ఉంది
- బాలయ్య ఆసక్తికర వ్యాఖ్యలు



02



# యుద్ధంలోకి అమెరికా
### ఇరాన్‌కు చెందిన 3 ప్రధాన అణుకేంద్రాలపై దాడి
ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధంలోకి ఎంట్రీ

బీ-2 స్పిరిట్ బాంబర్లతో దాడి.. స్వయంగా పర్యవేక్షించిన ట్రంప్

అమెరికానే యుద్ధాన్ని ప్రారంభించింది- ఇక తీవ్ర పరిణామాలు : ఇరాన్ హెచ్చరిక

"ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలోకి అమెరికా ప్రత్యక్షంగా ప్రవేశించింది. తాజాగా ఇరాన్‌కు చెందిన 3 ప్రధాన అణుకేంద్రాలపై అమెరికా దాడి చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై తాము దాడి చేసినట్లు స్వయంగా ప్రకటించారు. మరోవైపు యూఎస్ దళాలు తమ అణుకేంద్రాలపై దాడి చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా కూడా ధ్రువీకరించింది. - మహా

వివరాలు 3లో

## తీవ్రంగా స్పందించిన ఇరాన్
- ఇజ్రాయెల్‌పై 27 మిస్సైళ్లతో ఇరాన్ దాడి
- అమెరికా సిద్ధంగా ఉండాలి- ఇరాన్ హెచ్చరిక
- అమెరికాపై భద్రతా మండలికి ఇరాక్ ఫిర్యాదు
- ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఫోన్
- అమెరికా దాడులను సమర్థించిన బ్రిటన్
- ట్రంప్ కొత్త చరిత్రను లిఖించారు : నెతన్యాహూ

03

# కేసీఆర్ కేటీఆర్‌కు జైలు పక్కా



## ఫోన్ ట్యాపింగ్ లో తప్పుచేసిన వారంతా జైలుకు పోక తప్పదు
- రాజకీయ నేతలు, సినీతారలు, జడ్జిల ఫోన్లు ట్యాప్ చేయడం నీచం
- బనకచర్లపై అఖిలపక్షం పెట్టినా.. బీఆర్ఎస్ అనవసర ఆరోపణలు
- స్థానిక ఎన్నికలపై కేబినెట్ లోనే నిర్ణయం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

02

### విధ్వంసం నుంచి వికాసం వైపు
రేపు ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పుస్తకావిష్కరణ

వివరాలు 2లో



# క్షుద్ర పూజతో ఖతం చేస్తా
## 15 రోజుల్లో నువ్వు అవుట్
- మాగంటి గోపినాథ్ కు ఇలాగే చేశా
- 100 కోట్లు ఖర్చయినా సరే.. నిన్ను..
- సంధ్య కన్వెన్షన్స్ అధినేత శ్రీధర్ రావు బెదిరింపుల ఆడియో వైరల్
- బీఆర్ఎస్ హయాం నుండే సంధ్య శ్రీధర్ ఆగడాలు
- తీవ్రంగా మండిపడుతున్న మాగంటి గోపినాథ్ అభిమానులు
- ఇటీవల నటి రమ్యశ్రీ పై దాడి నేపథ్యంలో కేసు నమోదు

"ఈ రోజు శుక్రవారం నుండి పూజలు స్టార్ట్ చేసిన. సరిగ్గా 15 రోజులు అంతే. మాగంటి గోపీనాథ్‌కు క్షుద్రపూజలు చేసి ఖతం చేసినట్టుగా నిన్ను కూడా ఖతం చేస్తా అంటూ సంధ్య కన్వెన్షన్స్ అధినేత శ్రీధర్ రావు వార్నింగ్ ఇచ్చారు. పదిహేను రోజుల్లో నీ డౌన్ ఫాల్ మొదలవుతుందని, కిడ్నీలు ఫెయిల్ అయి చనిపోతావంటూ తనతో వ్యాపారం చేసిన భాగస్వామిని హెచ్చరించిన ఆడియో సంచలనంగా మారింది. - మహా, హైదరాబాద్

వివరాలు 2లో



## నేడు రాష్ట్ర కేబినెట్ సమావేశం
### మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం
**హైదరాబాద్, మహా** తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం సోమవారం మధ్యాహ్నం 3గంటలకు జరగనుంది. సచివాలయంలోని ఆరోఅంతస్తులో ఈ మీటింగ్ జరగనుండగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఉత్తర్వులు జారీచేశారు. రైతు భరోసా విజయవంతంగా అమలైన నేపథ్యంలో క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్ పై ప్రభుత్వవర్గాలు సంతోషంగా ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజువారీ సమీక్షలు సత్ఫలితాలనిచ్చాయి.

మిగతా 3లో

## ఎమ్మెల్సీ కవితకు ఎంపీ ఆర్.కృష్ణయ్య మద్దతు
### బీసీలంతా కవిత పోరుకు మద్దతునివ్వాలని పిలుపు

**హైదరాబాద్, మహా** : బీసీల కోసం పోరాడుతున్న తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీసీలందరూ అండగా ఉండాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల కోసం కవిత ముందుకొచ్చి మాట్లాడుతున్నారని, పోరాటం కూడా చేస్తున్నారని కొనియాడారు. బీసీల కోసం అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు.

మిగతా 2లో





## ఈటలకు బండి సంజయ్ కౌంటర్!
- బీజేపీలో ఉంటే అదే స్టాండ్‌లో మాట్లాడాలి
- వ్యక్తిగతం అంటూ పార్టీలో ఏమీ ఉండదు
- ఈటల అభిప్రాయానికి తాను పూర్తి భిన్నమని కామెంట్


వివరాలు 2లో

## ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్
### అమెరికా దాడుల నేపథ్యంలో తాజా పరిస్థితిపై ఆరా

వివరాలు 3లో

## విజయ్ దేవరకొండపై అట్రాసిటీ కేసు
- రెట్రో ప్రీరిలీజ్ ఈవెంట్ లో వ్యాఖ్యలపై ఫిర్యాదు
- గిరిజనులను కించపరిచేలా మాట్లాడారని సంఘాల ఫైర్
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రాయదుర్గం పోలీసులు

03



## కొండా ఫ్యామిలీపై మీనాక్షి సీరియస్!
### వరుస కామెంట్లతో తార స్థాయికి వార్
- మీనాక్షి నటరాజన్‌కు వరంగల్ ఎమ్మెల్యేల ఫిర్యాదు
- ఇటీవల కామెంట్స్ తో మంత్రి కొండా సురేఖపై లీడర్ల ఆగ్రహం
- త్వరలో ఢిల్లీ పెద్దలకు కూడా ఫిర్యాదు చేసే చాన్స్

వివరాలు 2లో



## ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించిన ఐక్యరాజ్యసమితి
ఇది అంతర్జాతీయ శాంతి, భద్రతలకు ముప్పు అని వ్యాఖ్య

03

# రప్పా రప్పా దేనికి?

## తెలంగాణను ఏం చేయాలనుకుంటున్నారు?

### శాంతిభద్రతలపై కుట్రచేస్తున్నారా?

### బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి ఫుల్ ఫైర్



**హైదరాబాద్, మహా:** రప్పా రప్పా అంటూ ఫ్లెక్సీలు వేసుకుంటున్నారు... ఇదంతా దేనికోసం అని గులాబీ పార్టీ నేతలను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిలదీశారు. మాజీమంత్రులు హరీష్ రావు , జగదీశ్వర్ రెడ్డి అభిమానులు కూడా రప్పా రప్పా అనే డైలాగులు ఫ్లెక్సీ ల పై ఏర్పాటుచేసి... 3.0 లోడింగ్ అంటూ నేతల పర్యటనల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ ఏపథ్యంలో పొంగులేటి సీరియస్ గా రియాక్ట్ అయ్యారు. శాంతి భద్రతలతో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని... ఏం చేయాలనుకుంటున్నారు..? సినిమా డైలాగులు వాడుకొని రెచ్చిపోతున్నారు...? అంటూ ఫుల్ ఫైర్ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వానికి శాంతి భద్రతల విషయంలో చిత్తశుద్ధి ఉందని.. గుర్తు చేశారు. సినిమా డైలాగులు చెప్పుకొని ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే.. ప్రజలే వాళ్లకు బుద్ధి చెబుతారని వార్నింగ్ ఇచ్చారు.

# వరంగల్ నేతల వ్యవహారాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాం

## క్రమశిక్షణాసంఘం ఛైర్మన్ మల్లు రవి

### మీనాక్షి నటరాజన్ తో చర్చించి కార్యాచరణ



**హైదరాబాద్, మహా:** వరంగల్, గజ్వేల్ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని , ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో చర్చించి సమస్యలను తెలుసుకొని పార్టీ ఆదేశాల మేరకు కార్యాచరణ ప్రారంభిస్తామని క్రమశిక్షణాసంఘం ఛైర్మన్ మల్లు రవి తెలిపారు. పార్టీ లైన్ ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళితో ఇతర కాంగ్రెస్ నేతల మధ్య ఇటీవల వర్గపోరు తీవ్రం కాగా, ఆదివారం కూడా ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ను కలిసి అక్కడి ఎమ్మెల్యేలు నేతలు, కొండా దంపతులకు వ్యతిరేకంగా ఫిర్యాదుచేశారు. వరంగల్ నేతల వ్యవహారం.. గజ్వేల్‌లో స్థానిక నాయకత్వంపై ఫిర్యాదులు క్రమశిక్షణా కమిటీకి చేరాయి. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనలు, అంతర్గత వివాదాలపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇప్పటికే దీనిపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ కూడా స్పందించారు.

# దామోదర రాజనరసింహ పేరుతో సినిమా తీయాలని ఉంది

## బాలయ్య ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా** బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ప్రారంభించి పాతిక సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం నాడు హైదరాబాద్‌లో ఆస్పత్రి 25వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఛైర్మన్ బాలకృష్ణతో పాటుగా.. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనో.. లేక భారీగా లాభాలు ఆర్జించాలనే ఆశతోనో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించలేదని బాలకృష్ణ చెప్పుకొచ్చారు. తమకు కలిగిన వ్యక్తిగత నష్టం నుంచి పుట్టిన ఆలోచనల్లో నుంచే బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి పుట్టుకొచ్చిందని చెప్పుకొచ్చారు. తమ తల్లి క్యాన్సర్‌తో మరణించడం వల్ల.. అందరికీ క్యాన్సర్ చికిత్స అందించాలని ఉద్దేశంతో.. తమ తండ్రి ఎన్టీఆర్ ఈ క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించారు అని బాలయ్య గుర్తు చేసుకున్నారు. తమకు



అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తోన్న రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు, సీఎంలకు బాలయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బాలయ్య.. తనకు దామోదర రాజ నరసింహ పేరుతో ఒక సినిమా చేయాలని ఉందంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# కేసీఆర్ కేటీఆర్‌కు జైలు పక్కా




**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ లపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ తో సహా తప్పు చేసిన ప్రతి ఒక్కరూ జైలుకు వెళ్ళక తప్పదని ఇదంతా ఆషామాషీగా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ఉన్న మహేష్ కుమార్ గౌడ్ కు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు కార్పోరేషన్ ఛైర్మన్లు ఇరావత్రి అనిల్, తాహెర్ బిన్, వేణు, జిల్లా నాయకులు, వివిధ సంఘాల నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, మంత్రివర్గంలో చర్చించిన తర్వాతే షెడ్యూల్‌పై తుది నిర్ణయం వెలువడుతుందని స్పష్టం చేశారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. కోట్ల ప్రజా ధనాన్ని నీళ్లలో పోసిందని మండిపడ్డారు. ఆర్థిక దుర్వినియోగంపై కమిషన్ విచారణ చేస్తున్నదని, చట్ట పరిధిలో శిక్ష తప్పదన్నారు. తాము బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హక్కుల కోసం వెనక్కి తగ్గమని, ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం జరిగినప్పటికీ బీఆర్ఎస్ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంకా రాజకీయ నేతలు, సినీ తారలు, జడ్జీల ఫోన్లను ట్యాప్ చేసిన నీచమైన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకి ఉందని మండిపడ్డారు. 2022 నుంచి 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయబడ్డాయని, ఈ విషయంలో సిట్ ముందు సాక్షిగా వాంగ్మూలం ఇచ్చానని, కేసీఆర్, కేటీఆర్‌లు సిగ్గుతో తలదించుకోవాలని, ఈ వ్యవహారంలో భాగమైన ప్రతి ఒక్కరూ జైలుకు వెళ్ళక తప్పదన్నారు.

# విధ్వంసం నుంచి వికాసం వైపు

## రేపు ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పుస్తకావిష్కరణ

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర ప్రజాపాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా, గత పదేళ్ల బీఆర్ఎస్ విధ్వంస పాలనను విశ్లేషిస్తూ వివిధ పత్రికలలో టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ రాసిన వ్యాసాల సంకలనం "విధ్వంసం నుంచి వికాసం వైపు" అనే పుస్తకాన్ని మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్ లో జరుగనున్న టీపీసీసీ నూతన మొదటి ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ,కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుల సమక్షంలో ఆవిష్కరించనున్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపుసంకలనంలో మహేష్ కుమార్ గౌడ్ వివిధ పత్రికల్లో రాసిన 36 వ్యాసాలను ఇందులో పొందుపరిచారు. ఈ పుస్తకం దాదాపు 260 పేజీలు ఉంది. “ఇందిరమ్మ రాజ్యం” లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ




చేసేందుకు ఈ వ్యాసాలు ఉపయోగపడతాయనే భావనలో టీపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఉన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విధ్వంసం పాలైన రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ నినాదంతో వికాసం దిశగా తీసుకెళ్తున్న ప్రగతిని ఈ వ్యాసాలు ప్రతిబింబిస్తున్నాయి.

# ఎమ్మెల్సీ కవితకు ఎంపీ ఆర్.కృష్ణయ్య మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

బీసీలు కూడా కవితకు మద్దతివ్వడంతో పాటు ఆమె పోరాటానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. బీసీలపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వంబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని కృష్ణయ్య మండిపడ్డారు. బీసీలకు 75 ఏళ్లుగా అన్యాయం జరుగుతోందని, వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకొని కమిట్మెంట్‌తో పోరాటం చేయకపోతే చాలా ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న రిజర్వేషన్లు కూడా తగ్గుతాయని చెప్పారు. బీసీ కాకపోయినా కవిత మన కోసం పోరాటం ప్రారంభించారని, కేవలం మన కోసం పులి మీద స్వారీకి సిద్ధమయ్యారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఆమె చేసే పోరాటాన్ని ఎవరూ తప్పుపట్టొద్దని కోరారు. అందరం ఐక్యంగా ఉద్యమం చేస్తేనే.. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దిగి వస్తాయని చెప్పారు. జూలై 17న జరిగే జాగృతి రైల్ రోకోకు కచ్చితంగా మద్దతు ఇస్తామని ఎమ్మెల్సీ కవితకు ఆర్.కృష్ణయ్య హామీ ఇచ్చారు.



# ఈటలకు బండి సంజయ్ కౌంటర్!

- బీజేపీలో ఉంటే అదే స్టాండ్‌లో మాట్లాడాలి
- వ్యక్తిగతం అంటూ పార్టీలో ఏమీ ఉండదు
- ఈటల అభిప్రాయానికి తాము పూర్తి భిన్నమని కామెంట్

**కరీంనగర్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఆ క్రమంలో ఈటల రాజేందర్‌కు బండి సంజయ్ పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. తమ పార్టీ స్టాండ్ ఒక్కటేనన్నారు. పార్టీ అధ్యక్షుడు అయితేనో కేంద్ర మంత్రిగా ఉంటేనో మా స్టాండ్ మారదని ఆయన కుండబద్దలు కొట్టారు. బీజేపీలో ఉంటే.. బీజేపీ స్టాండే మాట్లాడాలి కానీ వ్యక్తిగతం అంటూ ఏమీ ఉండదని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్ ఏటీఎం అయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఈటల రాజేందర్ అభిప్రాయానికి మేము పూర్తి భిన్నమని బండి సంజయ్ పేర్కొన్నారు. మేము ఊసరవెల్లి కాదన్నారు.

### సీబీఐ విచారణ జరపాలి..

కేబినెట్‌లో కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారంటే.. ఎవరూ నమ్మరన్నారు. కేసీఆర్ కేబినెట్ మీటింగ్ అంతా ఉత్తదేనని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరపాలని కేంద్రాన్ని కోరాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఇటీవల ఈటల రాజేందర్ ఒక మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ సంబంధించిన అంశాలపై సానుకూలంగా మాట్లాడారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఈ విధంగా వ్యాఖ్యలు చేయడంపై బీజేపీ నేతలు.. ఆ పార్టీ రాష్ట్ర అధినేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు.




# క్షుద్ర పూజతో ఖతం చేస్తా

**హైదరాబాద్, మహా:**
ఈ రోజు శుక్రవారం నుండి పూజలు స్టార్ట్ చేసిన. సరిగ్గా 15 రోజులు అంతే. మాగంటి గోపీనాథ్‌కు క్షుద్రపూజలు చేసి ఖతం చేసినట్టుగా నిన్ను కూడా ఖతం చేస్తా అంటూ సంధ్య కన్వెన్షన్స్ అధినేత శ్రీధర్ రావు వార్నింగ్ ఇచ్చారు. పదిహేను రోజుల్లో నీ డౌన్ ఫాల్ మొదలవుతుందని, కిడ్నీలు ఫెయిల్ అయి చనిపోతావంటూ తనతో వ్యాపారం చేసిన భాగస్వామిని హెచ్చరించిన ఆడియో సంచలనంగా మారింది. సంధ్య కన్వెన్షన్స్ అధినేత శ్రీధర్ రావు ఆగడాలకు అంతులేదు. ఎంతోమందిని బెదిరించి, మోసం చేసిన ఫిర్యాదులు ఆయనపై ఉన్నాయి. ఇటీవల సినీనటి రమ్యశ్రీ, ఆమె సోదరుడిపై శ్రీధర్ రావు దాడికి పాల్పడ్డ సంగతి తెలిసిందే. ఈ ఘటనతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా తాజాగా ఆయన ఓ వ్యక్తిపై బెదిరింపులకు పాల్పడిన ఆడియో వైరల్ అవుతోంది. ఆడియోలో శ్రీధర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మాగంటి గోపీనాథ్‌కు క్షుద్రపూజలు చేసి ఖతం చేసినట్టుగా నిన్ను కూడా ఖతం చేస్తా అంటూ వార్నింగ్ ఇచ్చారు. పదిహేను రోజుల్లో నీ డౌన్ ఫాల్ మొదలవుతుందని, కిడ్నీలు ఫెయిల్ అయి చనిపోతావని హెచ్చరించారు. నువ్వు ఎంత నీ బ్రతుకు ఎంత నీ భార్య వారం రోజుల్లో విదవరాలు అవుతుంది అంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అంతే కాకుండా ఆడియోలో శ్రీధర్ రావు బూతులు తిట్టారు.

### అరాచకాలు ఎన్నో...

శ్రీధర్ రావు అరాచకాలు గత కొంతకాలంగా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆయన అనేక నేరాలకు పాల్పడ్డారని గత బీఆర్ఎస్ హయాంలో ఆయన ఆగడాలు పెరిగిపోయాయని ఆరోపణలు వస్తున్నాయి. 2021లో బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ.13 కోట్లు చెల్లించినట్టు తెలుస్తోంది. ఆయనకు పోలీసులు, రాజకీయనాయకులతో మంచి సంబంధాలు ఉండటంతో ఎంతమంది ఆయనపై ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వంలో కేసులు నమోదు చేయలేదనే విమర్శలు వస్తున్నాయి. ఇపుడు కూడా ఓ ఎమ్మెల్యే అనారోగ్యానికి తానే కారణమని, మరొకరిని ఖతం చేస్తానంటూ ఏ ధైర్యంతో బెదిరింపులకు దిగుతున్నాడన్న ప్రశ్నలు తీవ్రస్థాయిలో వినపడుతున్నాయి. సంధ్య శ్రీధర్ వ్యవహారంపై ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు. ముఖ్యమంత్రి దృష్టికి ఇప్పటికే పలువురు బాధితులు తీసుకెళ్ళినట్లు తెలిసింది.

# కొండా ఫ్యామిలీపై మీనాక్షి సీరియస్!

- వరుస కామెంట్లతో తార స్థాయికి వార్
- మీనాక్షి నటరాజన్‌కు వరంగల్ ఎమ్మెల్యేల ఫిర్యాదు
- ఇటీవల కామెంట్స్ తో మంత్రి కొండా సురేఖపై లీడర్ల ఆగ్రహం
- త్వరలో ఢిల్లీ పెద్దలకు కూడా ఫిర్యాదు చేసే చాన్స్

**హైదరాబాద్, మహా:** వరుస కామెంట్లతో వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య పొలిటికల్ వార్ తార స్థాయికి చేరుకుంది. జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు.. మంత్రి కొండా సురేఖ మీద తిరుగుబాటు జెండా ఎగరేశారు. మంత్రిపై ఫిర్యాదు చేసేందుకు నేతలందరూ కూటమి కట్టారు. తాజాగా హస్తం నేతల పంచాయతీ తాజాగా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ వద్దకు చేరుకుంది. వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీనాక్షీ నటరాజన్ భేటీ అయ్యారు. కడియం శ్రీహరి, కార్పొరేషన్ ఛైర్మన్, ఎర్రబెల్లి స్వర్ణ తదితర నేతలు మీనాక్షి నటరాజన్‌తో సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో చర్చలో ఏం చేస్తారు.. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అయితే, ఇప్పటికే వరంగల్ పంచాయతీపై పీసీసీ చీఫ్‌కు సీనియర్ల నివేదిక అందింది. సీనియర్ల నివేదిక ఆధారంగా మీనాక్షి నటరాజన్ నిర్ణయం తీసుకోనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.


**త్వరలో హైకమాండ్ కు ఫిర్యాదు..?**

ఇన్ని రోజులు మంత్రి కొండా సురేఖ జిల్లాలో నేతలను కలుపుకుని పోవడం లేదన్న అసంతృప్తి ఉంది. ఇదే సమయంలో తాజాగా మంత్రి భర్త కొండా మురళి చేసిన తాజా వ్యాఖ్యలు అగ్గికి మరింత ఆజ్యం పోశాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు ఒకరిద్దరు నేతల్ని ఉద్దేశించి మురళి కామెంట్స్ చేశారు. పార్టీ మారినప్పుడు పదవులకు రాజీనామాలు చేసి రావాలంటూ.. మురళి అన్న ఆ మాటలే ఎమ్మెల్యేలందర్నీ ఏకం చేసినట్టు చెప్పుకుంటున్నారు. అప్పటిదాకా.. ఎవరి దారి వారిదే అన్నట్టున్నగా ఉన్న శాసనసభ్యులు.. కొండా మురళి వ్యాఖ్యలతో ఒక్క తాటి మీదికి వచ్చినట్టు సమాచారం. కొండా మురళి వ్యాఖ్యలతో.. కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి అంతా ఇప్పుడు ఏకమైనట్టు తెలిసింది. కొండా ఫ్యామిలీకి రేవూరి ప్రకాష్‌రెడ్డితో కూడా కయ్యం మొదలైంది. ఇప్పుడు



వరంగల్ సిటీలోని ఎమ్మెల్యేలతో పాటు.. కడియం శ్రీహరి లాంటి వాళ్ళంతా కలిసి కొండా దంపతులపై సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. త్వరలో వీరంతా ఢిల్లీ వెళ్ళి అధిష్టానం పెద్దలకు మంత్రి మీద ఫిర్యాదు చేయాలనుకుంటున్నట్టు సమాచారం.

# యుద్ధంలోకి అమెరికా



**మహా:** ఇజ్రాయెల్ఇరాన్ యుద్ధంలోకి అమెరికా ప్రత్యక్షంగా ప్రవేశించింది. తాజాగా ఇరాన్‌కు చెందిన 3 ప్రధాన అణుకేంద్రాలపై అమెరికా దాడి చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై తాము దాడి చేసినట్లు స్వయంగా ప్రకటించారు. మరోవైపు యూఎస్ దళాలు తమ అణుకేంద్రాలపై దాడి చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా కూడా ధ్రువీకరించింది.

**బీ-2 స్పిరిట్ బాంబర్లతో దాడి**

ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ వాయుసేనలు సంయుక్తంగా దాడులు చేశాయి. ముఖ్యంగా అమెరికా అత్యంత భయంకరమైన బీ2 స్పిరిట్ బాంబర్లతో ఇరాన్‌పై విరుచుకుపడింది. వాస్తవానికి ట్రంప్ ఇరాన్‌కు 2 వారాల గడువు ఇచ్చారు. కానీ ఆయన కనీసం రెండు రోజులు కూడా ఆగలేదు. ట్రంప్ ఆదేశంతో నిన్న రాత్రే అమెరికాలోని వైట్‌మన్ ఎయిర్ బేస్ నుంచి బీ2 స్పిరిట్‌లు, ఎనిమిది కేసీ 135 స్ట్రాటో ట్యాంకర్లు ఇండోపసిఫిక్‌లోని డియాగో గార్సియాకు వెళ్లాయి. అవి మైటీ11, మైటీ21 అనే కాల్‌సైన్‌లు వాడినట్లు ఫ్లైట్ రాడార్ 24 తెలిపింది.

## ఫోర్డో అణుకేంద్రం ధ్వంసం

ఫోర్డో అణుకేంద్రాన్ని తాము ధ్వంసం చేశామని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. వాస్తవానికి ఫోర్డో న్యూక్లియర్ సైట్ క్యామ్ నగరానికి అత్యంత సమీపంలో ఉంది. ఇరాన్‌కు ఈ అణుకేంద్రం చాలా కీలకమైంది. 1981లో ఇజ్రాయెల్ ఎఫ్15, ఎఫ్16 యుద్ధ విమానాలు బాగ్దాద్‌లోని అణు కేంద్రాన్ని ధ్వంసం చేయడాన్ని దృష్టిలో ఉంచుకుని, ఇరాన్ ముందు జాగ్రత్తగా దీన్ని నిర్మించింది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఇన్‌స్పెక్టర్లు 2023లో ఇక్కడ 83.7శాతం శుద్ధిచేసిన యురేనియంను గుర్తించారు. అత్యంత శక్తిమంతమైన అణుబాంబుల్లో వాడే 90 శాతం శుద్ధి చేసిన యురేనియంకు ఇది చాలా దగ్గర్లో ఉన్నట్లు వారు ధ్రువీకరించారు. అణువ్యాప్తి నిరోధక ఒప్పందంపై ఇరాన్ సంతకం చేసిన నేపథ్యంలో ఆ దేశం ఇలా యురేనియం శుద్ధి చేయడం నిబంధనలకు విరుద్ధం. "ప్రపంచానికి ఇది ఒక చారిత్రక క్షణం. కీలకమైన ఇరాన్ అణుస్థావరాలను ధ్వంసం చేశాం. ప్రపంచం ఎదుర్కొంటున్న అణు ముప్పును ఆపడమే మా లక్ష్యం" అని డొనాల్డ్ ట్రంప్ అన్నారు.

## తీవ్రంగా స్పందించిన ఇరాన్

మూడు కీలక అణు స్థావరాలపై అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఆదివారం తెల్లవారుజామున ఈ దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్‌పై మిస్సైళ్లతో విరుచుకుపడింది. రెండు విడతల్లో 27 మిస్సైళ్లను ఇజ్రాయెల్‌లోని హైఫా, టెల్ అవీవ్ నగరాలపైకి ఇరాన్ సంధించింది. ఈ దాడుల్లో దాదాపు 11 మందికి గాయాలయ్యాయి. టెల్ అవీవ్ సమీపంలోని బెన్ గురియన్ ఎయిర్‌పోర్టుపైనా దాడి చేశామని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. ఇరాన్ ఎటాక్స్‌తో ఇజ్రాయెల్ అంతటా సైరన్ల శబ్దాలే వినిపించాయి. ప్రజలంతా భయంతో అండర్ గ్రౌండ్ బంకర్లలో దాక్కున్నారు. దీంతో ఇరాన్‌పైనా ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడులను ప్రారంభించాయి.

## యుద్ధాన్ని అమెరికానే ప్రారంభించింది : ఇరాన్

తమ దేశంతో యుద్ధాన్ని స్వయంగా అమెరికానే ప్రారంభించిందనే విషయాన్ని యావత్ ప్రపంచం గుర్తుంచుకోవాలని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రకటించింది. మారణహోమానికి పాల్పడే, అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా నడుచుకునే ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా నిలుస్తోందని ఆరోపించింది. మూడు అణుస్థావరాలపై అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ శాఖ సుదీర్ఘ ప్రకటనను విడుదల చేసింది. అమెరికా సైన్యం దుస్సాహసానికి తమ సర్వశక్తులతో బదులిస్తామని వెల్లడించింది. శత్రు దేశాన్ని ప్రతిఘటించే హక్కు తమకు ఉందని ఇరాన్ స్పష్టంచేసింది. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం తలవంచుకుండా పోరాటాన్ని కొనసాగిస్తామని తేల్చి చెప్పింది.

# ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్

### అమెరికా దాడుల నేపథ్యంలో తాజా పరిస్థితిపై ఆరా



**మహా:** ఇరాన్ భూగర్భ అణు కేంద్రాలపై అమెరికా దాడుల నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అక్కడి తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇజ్రాయెల్ఇరాన్ మధ్య ఘర్షణలు పదవ రోజుకు చేరిన తరుణంలో పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడంపై ఆయనతో చర్చించారు. అక్కడ ఇటీవల నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులపై ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలను తగ్గించడం కోసం రెండు దేశాలు ముందుకు రావాలని.. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రధాని సూచించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా తెలిపారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో మాట్లాడానని. ప్రస్తుత పరిస్థితి గురించి తాము వివరంగా చర్చించామని ప్రధాని మోదీ తెలిపారు. ఇటీవలి ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశామన్నారు. ఇరుదేశాల్లో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడం కోసం చర్చలు, దౌత్య మార్గాల ద్వారా ముందుకు వెళ్లాలని సలహా ఇచ్చాను' అని ప్రధాని మోదీ తెలిపారు.

# ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించిన ఐక్యరాజ్యసమితి

### ఇది అంతర్జాతీయ శాంతి, భద్రతలకు ముప్పు అని వ్యాఖ్య

**మహా:** ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడి చేయడాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తీవ్రంగా ఖండించారు. ఇరాన్‌పై అమెరికా దాడి చేయడం తమను ఆందోళనకు గురిచేసిందని అన్నారు. ఈ దాడి అంతర్జాతీయ శాంతి, భద్రతలకు ముప్పు తెస్తుందని పేర్కొన్నారు. ఐరాసలోని సభ్య దేశాలు కచ్చితంగా యూఎన్ ఛార్టర్ నియమాలని పాటించాలని సూచించారు. సైన్యంతో ఉద్రిక్తతలను నివారించలేమని, కేవలం దౌత్యంతోనే శాంతి నెలకొంటుందని ఆయన పేర్కొన్నారు.

**మాట నిలబెట్టుకున్నా...**

అమెరికా ఇరాన్‌లోని ఫోర్డ్, నతాంజ్, ఇస్ఫాహన్ అణు స్థావరాలపై భీకర దాడులు చేసింది. ఇరాన్ అధికారిక మీడియా కూడా దీన్ని ధ్రువీకరించింది. ఈ నేపథ్యంలోనే 'యుద్ధం ప్రారంభమైనప్పుడే ఇరాన్ అణుకేంద్రాలను నాశనం చేస్తానని మాట ఇచ్చాను. ఇప్పుడు దాన్ని నెలబెట్టుకున్నాను' అని నెతన్యాహు అన్నారు.

## అమెరికా దాడులకు తీవ్ర పరిణామాలు

### అబ్బాస్ అరగ్చి, ఇరాన్ విదేశాంగ మంత్రి

"మా దేశ అణు స్థావరాలపై అమెరికా దాడులు చేయడం దారుణం. దీనికి తీవ్ర పరిణామాలు ఉంటాయి. ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ప్రకారం ఇక ప్రతిస్పందించే హక్కు ఇరాన్‌కు ఉంది. మా దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలు, ప్రజా పరిరక్షణ కోసం ఏమేం చేయాలో అవన్నీ చేస్తాం" అని పేర్కొంటూ ఆదివారం ఉదయం ఎక్స్ వేదికగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి ఓ పోస్ట్ పెట్టారు. ఇరాన్‌లోని అణు స్థావరాలపై అమెరికా దాడుల గురించి చర్చించేందుకు భద్రతా మండలి అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడులు నీచమైనవి, చట్టవ్యతిరేకమైనవని ఆయన ఆరోపించారు. ఇందుకుగానూ అమెరికాను జవాబుదారీగా నిలపాల్సిన బాధ్యత ఐరాస భద్రతామండలిపై ఉందన్నారు. ఐరాస ఛార్టర్, అంతర్జాతీయ చట్టాల కింద అమెరికాపై చర్యలు తీసుకోవాలని అమీర్ సయీద్ కోరారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడానికి అమెరికా, ఇజ్రాయెల్ కారణం అవుతున్నాయని ఆయన తెలిపారు. ఇరాన్‌లో శాంతియుతంగా నడుస్తున్న అణు స్థావరాలపై జూన్ 13న ఇజ్రాయెల్ దాడులు చేసిందని, వాటికి కొనసాగింపుగా ఆదివారం రోజు అమెరికా సైతం ఎటాక్స్ చేసిందని ఆరోపించారు.

## ట్రంప్ కొత్త చరిత్రను లిఖించారు : నెతన్యాహూ



ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడులు చేసినందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ అభినందించారు. ట్రంప్ ధైర్యవంతమైన నిర్ణయం తీసుకున్నారని, దీని ప్రభావంతో చరిత్ర మారిపోతుందన్నారు. ఈ దాడులతో అమెరికా బలమేంటో ప్రపంచానికి మరో తెలిసొచ్చిందని కొనియాడారు. ఈమేరకు ఒక వీడియో సందేశాన్ని నెతన్యాహూ విడుదల చేశారు. భూమిపై అత్యంత శక్తివంతమైన పేలుళ్లు చేయగల సత్తా అమెరికాకే ఉందని ఇరాన్‌పై దాడులతో నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన పాలకుడికి, ప్రమాదకరమైన ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారని చెప్పారు. ఇప్పటివరకు ఇరాన్‌పై దాడుల్లో తాము సాధించిన విజయాలను మించిన విజయాన్ని అమెరికా అందుకుందని నెతన్యాహూ తెలిపారు. ట్రంప్ లిఖించిన కొత్త చరిత్ర పశ్చిమాసియా ప్రాంతం సమృద్ధి, శాంతితో ముందుకు సాగడానికి బాటలు వేస్తుందన్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌లను దేవుడు ఆశీర్వదించాలని, ఇరుదేశాల కూటమి, విశ్వాసం కలకాలం వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

# విజయ్ దేవరకొండపై అట్రాసిటీ కేసు

### రెట్రో ప్రీరిలీజ్ ఈవెంట్‌లో వ్యాఖ్యలపై ఫిర్యాదు

### గిరిజనులను కించపరిచేలా మాట్లాడారని సంఘాల ఫైర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రాయదుర్గం పోలీసులు



**హైదరాబాద్, మహా :** టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల నిర్వహించిన 'రెట్రో' ప్రీరిలీజ్ వేడుకల్లో ఆయన చేసిన వ్యాఖ్యలపై గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విజయ్ దేవరకొండ వ్యాఖ్యలు ఆదివాసీలను అవమానించేలా ఉన్నాయని మండిపడుతున్నాయి. దీనిపై ఆదివాసులు, గిరిజన సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో పాటు చాలాచోట్ల ఆ సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద విజయ్ దేవరకొండపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హీరో వ్యాఖ్యలపై విచారణ జరిపుతున్నట్లు వారు వివరించారు. తమిళ హీరో సూర్య నటించిన 'రెట్రో' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్ర దాడిని ఖండిస్తూ కొన్ని కామెంట్స్ చేశారు. 'పాకిస్తాన్ మీద ఇండియా ఎటాక్ చేయాల్సిన పనే లేదని.. అక్కడి ప్రజలకు విరక్తి వచ్చి వాళ్ల ప్రభుత్వం వాళ్లే మీద ఎటాక్ చేస్తారన్నారు. కరెంట్, నీళ్లు లేకుండా ఆ దేశంలో పరిస్థితులు ఇదే విధంగా కంటిన్యూ అయితే..500 ఏళ్ల క్రితం ట్రైబల్స్ కొట్టుకున్నట్లు బుద్ధి లేకుండా, పని లేకుండా కొట్లాడుతారన్నారు. మనమంతా సమష్టిగా కలిసి ఉండాలి' అని అన్నారు. విజయ్ దేవరకొండ ఆదివాసులను అవమానించేలా మాట్లాడారని ట్రైబల్స్ లాయర్స్ అసోసియేషన్ బాపూనగర్ అధ్యక్షుడు కిషన్‌రాజ్ చౌహాన్ కిషన్ సహా గిరిజన సంఘాలు తప్పుబట్టాయి.

## నా వ్యాఖ్యల వల్ల బాధ కలిగితే క్షమించండి

### క్లారిటీ ఇచ్చిన హీరో విజయ్ దేవరకొండ

తనపై రాయదర్గ పోలీసుస్టేషన్ లో కేసు నమోదవడంతో హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "నాకు తెలిసి, నా మాటల వల్ల కొన్ని వర్గాల మనోభావాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. కానీ.. నేను ఎప్పుడూ ఏ తెగను, ఏ వర్గాన్ని కించపరచాలనే ఉద్దేశంతో మాట్లాడలేదు. భారతదేశ ప్రజలంతా ఒక్కటే అని నమ్మే మనిషిని. నేను మాట్లాడిన ట్రైబ్ అనే పదాన్ని వేరే అర్థంతో వాడాను. దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. ఎవరికైనా నా వ్యాఖ్యల వల్ల బాధ కలిగితే క్షమించండి. నేను శాంతి, ఐక్యత గురించి మాత్రమే మాట్లాడాను" అంటూ క్లారిటీ ఇస్తూ క్షమాపణలు తెలిపారు.

# అదంతా సొల్లు వాగుడు

### ట్రంప్‌పై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విమర్శలు

### భారత్ పాక్ యుద్ధం ఆపానంటూ ట్రంప్ చెప్పడం తప్పన్న నేత



**న్యూఢిల్లీ, మహా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వాణిజ్య ఒప్పందాలను ఆశ చూపించి భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ కోసం మధ్యవర్తిత్వం చేయడంలో కీలక పాత్ర పోషించానని ట్రంప్ పదే పదే చేసిన వాదనలను ఒవైసీ తీవ్రంగా ఖండించారు. వాణిజ్య ప్రోత్సాహకాలను ఉపయోగించుకోవడం ద్వారా భారత్‌పాకిస్తాన్ ఘర్షణలను విజయవంతంగా ఆపడానికి తాను చర్చలు జరిపానని ట్రంప్ అనేకసార్లు పేర్కొన్నారు. అయితే ఒవైసీ ఈ వాదనలను అర్థం లేనివిగా కొట్టిపారేశారు. భారత్అమెరికా సంబంధాల వ్యూహాత్మక స్వభావాన్ని ప్రస్తావిస్తూ ఇందులో ఉన్న సంక్లిష్టతలను ట్రంప్ అర్థం చేసుకోవాలని అన్నారు. ఓ టీవీ షోలో ఒవైసీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒవైసీ మాట్లాడుతూ.. "మొదట ట్రంప్‌కు పెద్దగా జ్ఞానం లేదని నేను అనుకుంటున్నాను. భారత్‌కు అమెరికాతో వ్యూహాత్మక సంబంధం ఉంది, ట్రంప్ పదే పదే మాట్లాడుతూనే ఉన్నారు. మన ప్రధానమంత్రి ఆయనతో అరగంట సేపు మాట్లాడారు, మన విదేశాంగ కార్యదర్శి కూడా అధికారిక వీడియోను విడుదల చేశారు. అయినప్పటికీ వాణిజ్య ఒప్పందాలను అందించడం ద్వారా యుద్ధాన్ని ఆపానని ట్రంప్ అంటున్నారు. ఇది వాస్తవానికి దూరంగా ఉంది. అమెరికాతో పాకిస్తాన్ వాణిజ్యం దాదాపు 4 బిలియన్ డాలర్లు, అమెరికాతో భారత్ వాణిజ్యం 180 బిలియన్ డాలర్ల వరకు ఉంది. భారత్ అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తే 500 బిలియన్ డాలర్లు అవుతుంది. అప్పుడు వారు 5 బిలియన్ డాలర్లు కోరుకుంటారా? 500 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని కోరుకుంటున్నారా?" అని ఆయన ప్రశ్నించారు. ట్రంప్ తన ప్రకటనల వెనుక పాకిస్తాన్‌తో క్రిప్టో సంబంధాలను సూచిస్తున్నాయని తీవ్ర విమర్శలు గుప్పించారు.

కాల్పుల విరమణ ప్రకటన చేసిన విధానంపై ఒవైసీ నిరాశ వ్యక్తం చేశారు. "నా ఫిర్యాదు ఏంటంటే.. ట్రంప్ నుండి ప్రపంచానికి దీని గురించి తెలియకుండా మన ప్రధాన మంత్రి లేదా మన ప్రభుత్వం దీనిని ప్రకటించి ఉండాల్సింది. ఇది మన ప్రభుత్వం, మన దేశం, మనం దీని గురించి వేరే దేశ నాయకుడి నుండి తెలుసుకుంటున్నాం." అని ఒవైసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్రంప్ విదేశాంగ విధాన ప్రభావాన్ని విస్తృతంగా విమర్శిస్తూ, పరిష్కారం కాని ప్రపంచ సంఘర్షణలను ఎత్తి చూపుతూ అమెరికా అధ్యక్షుడి శాంతి స్థాపన సామర్థ్యాల వాదనలను ఒవైసీ ప్రశ్నించారు. "ట్రంప్ మన యుద్ధాన్ని ఆపానని చెప్పుకుంటే, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ఎందుకు ఆపడం లేదు? అంత పవర్ ఉంటే, ఇరాన్ఇజ్రాయెల్ యుద్ధాన్ని, రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపండి." అంటూ అమెరికాకు సవాల్ విసిరారు.

# నేడు రాష్ట్ర కేబినెట్ సమావేశం

### మధ్యాహ్నం 3గంటలకు సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కూడా సాఫీగా పట్టాలెక్కింది. ఈ క్రమంలో గ్రామీణ ప్రజల్లో క్యాడర్‌లో జోష్ నింపేలా పలు కీలక నిర్ణయాలు తీసుకోవొచ్చని వినబడుతోంది. బిసి రిజర్వేషన్లతో ఎన్నికలు ముడిపడి ఉండడంతో ప్రభుత్వ వ్యూహంపై చర్చ జరిగే అవకాశాలున్నాయి.

**ఇదీ ఎజెండా**

1. రాజీవ్ యువ వికాసం
2. బనకచర్ల ప్రాజెక్టు అడ్డుకునే వ్యూహం.. తాజా పరిస్థితులపై చర్చ
3. బడ్జెట్ నిధులు, పెండింగ్ పనులపై చర్చ
4. స్థానిక ఎన్నికలు.. రిజర్వేషన్లపై వ్యూహం
5. మెట్రో, మూసీ, ఫ్యూచర్ సిటీలకు సంబంధించిన అనుబంధ పనులు
6. కాళేశ్వరం కమిషన్, ఫార్ములా రేస్ విచారణలు.. తదుపరి వ్యూహాలు

స్థానిక సంస్థల ఎన్నికలు, బనకచర్ల ప్రాజెక్ట్, రాజీవ్ యువ వికాసం, రైతు భరోసా తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. కేబినెట్ సమావేశంలో జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ స్థాయిలో జరిగే ఎన్నికల షెడ్యూల్‌పై ప్రాథమిక చర్చ జరిగే అవకాశం ఉంది. తద్వారా స్థానిక సంస్థల పాలనను మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ యోచిస్తున్నట్లు తెలిసింది. మంత్రివర్గ సమావేశం నిర్ణయాల ద్వారా ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో ఆదర్శ రైతులను నియమించే అంశంపై నిర్ణయం తీసుకోనునే అవకాశాలున్నాయి. రైతు వేదికలకు ఆదర్శ రైతులను ఇన్‌చార్జ్‌లుగా నియమించి, భూసార పరీక్షల నిర్వహణ కిట్లు వారి అదీనంలో ఉంచడం, వ్యవసాయ అంశాలపై రైతులతో అవసరమైనప్పుడల్లా సమావేశాలు నిర్వహించి వారికి సూచనలు ఇచ్చే విధంగా వీరిని నియమిస్తారంటున్నారు.

**ఎన్నికలకు రెడీ**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఎన్నికల సన్నాహాలను పూర్తి చేసింది. బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయడంతో పాటు ఓటరు జాబితాలు, పోలింగ్ స్టేషన్లను ఖరారు చేసింది. కాగా రాష్ట్రంలో 12,815 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలోని 1.14 లక్షల వార్డులు, 538 జడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు కావొస్తున్న తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనున్నాయి.

# మావోలతో చర్చలు అవసరం లేదు

- ఈసారి వర్షా కాలంలో వారిని నిద్రపోనివ్వం
- 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ గా మారుస్తాం
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్ట్రాంగ్ వార్నింగ్

**రాయ్‌పుర్, మహా:** వర్షాకాలంలోనూ మావోయిస్టు ఏరివేత ఆపరేషన్లు కొనసాగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయుధాలు వీడి, అభివృద్ధి పథంలో కలిసి రావాలని మావోయిస్టులకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఛత్తీస్‌గఢ్ చేరుకున్న అమిత్ షా.. రాయ్‌పుర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) క్యాంపస్, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రసంగించారు. ''ప్రతిసారి వర్షాకాలంలో పరిస్థితులను అనుకూలంగా తీసుకుని మావోయిస్టులు విశ్రాంతి తీసుకునేవారు. కానీ, ఈసారి వర్షాకాలంలో వారిని నిద్రపోనివ్వం. 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత ముందుకెళ్తాం'' అని అమిత్ షా పేర్కొన్నారు.

**ఆయుధాలు వీడి రావాలి..**

మావోయిస్టులు లొంగిపోవాలని, ఆయుధాలు వీడి.. అభివృద్ధి ప్రయాణంలో చేరాలని అమిత్ షా పిలుపునిచ్చారు. వారితో చర్చలు అవసరం లేదన్నారు. సాయుధ పోరాటాన్ని వదులుకుని జనజీవన స్రవంతిలో చేరే వారికి మరింత సాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధాని మోదీ దార్శనికత చాలా స్పష్టంగా ఉందని అమిత్ షా అన్నారు. 'మా ప్రభుత్వం కేవలం ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిపైనే దృష్టి పెట్టడం లేదు. సకాలంలో న్యాయం అందించేందుకూ చర్యలు తీసుకుంటోంది. కొత్త చట్టాలు దీనికి దోహదపడతాయి' అని తెలిపారు.

## అనుభవాలు

ఏదైనా సరే
అనుభవంలోకి రానిదే
మన కళ్ళు తెరచుకోవు!

పరిమళం
చుట్టు ముట్టందే
పూల వైపు దృష్టి సారించము!

సాంగత్య ఫలితాలు
అనుభవించందే
స్నేహాల విలువ గుర్తుకు రాదు!

గొంతు పొలమారినప్పుడైనా
రైతూ పొలమూ చెమటా
గుర్తుకు రాకపోతే మనుషులం కానట్లే!


వ్యాపారాలు ధనార్జనకే
వ్యవసాయం అట్లా కాదు
సకల జనుల సౌభాగ్యానికి!

ద్వేషాలు యుద్ధాలు
ఉన్మాద ప్రేరకాలు
కలిసి పాడే పాటే సూర్యోదయం!

ఏముంటది కాలం కరిగిపోయాక
నింగీ నేల మధ్య మనం
నడయాడిన గుర్తులు తప్ప!


కరచాలనాలు
కౌగిలింతలు వ్యాప్తి చేసినవారు
చరిత్రలో తరతరాలు
పలకరిస్తుంటారు!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి,
9440233261



# కబుర్ల దేవతకు కేంద్ర సాహిత్య అకాడమి 2025 బాల సాహిత్య పురస్కారం


డాక్టర్ గంగిశెట్టి శివకుమార్




కబుర్ల దేవత బాలల కథల సంపుటికి 2025 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్. ఈ కథల సంపుటిలో మొత్తం 36 కథలు ఉన్నాయి. దీన్ని అమరావతి పబ్లికేషన్స్, గుంటూరు ప్రచురించింది.

**కబుర్ల దేవత కథ గురించి వివరిస్తూ....**

"కొంతమంది మాటలు చెప్పి బతగ్గలరు. అదొక స్కిల్. అది అందరికీ రావాలని లేదు. అంతమాత్రాన పనిమంతుడికి విలువ తగ్గదు. పని తెలిసినవాడు తన పని తాను చేసుకెళ్లాలి. దానికీ ఫలితం ఉంటుంది. మాట్లాడేవాళ్లను చూసి బెదరిపోవద్దు అనే వ్యక్తిత్వ వికాస కోణంలో ఆ కథ పిల్లలకు చెప్పాను" అంటారు గంగిశెట్టి శివకుమార్. ఈ కథ తనుb బడిలో చదువుకునే రోజుల్లోనే రాసిన రెండవ కథగా చెబుతారు

నెల్లూరు జిల్లా రాపూరులో 28 ఫిబ్రవరి 1954న శ్రీమతి అంజనీదేవి, శ్రీ చిరంజీవి దంపతులకు జన్మించారు. యం.ఏ., ఎం.ఇడి., చదివి తెలుగులో పిల్లల కథలపై పి. హెచ్., చేశారు. ఉపాధ్యాయులుగా పదవీ విరమణ చేశారు. చందమామ పత్రికకు కొంతకాలం సబ్ ఎడిటర్ గా పనిచేశారు.

గంగిశెట్టి శివకుమార్ రచనలు అన్ని ప్రముఖ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. తెలుగులో బాల కథా సాహిత్యం (సిద్ధాంత గ్రంథం), యుక్తి, బోడి సలహా, కల్పిత బేతాళ కథలు 1, 2 భాగాలు, మన కట్టడాలు తెలుగులో నర్సరీ గేయాలు, మాటలతో ఆటలు, 9వ తరగతి చదివే పిల్లల కోసం రాసిన సైన్సు ప్రయోగ దీపికను NCERT మైసూర్ వారు ప్రచురించారు. ఇంకా ఊర్లు పేర్లు, పండుగలు ప్రచురించారు. పరమారాలు

అమెరికాలో పిల్లలకోసం 'జీవకారుణ్యం' కథావస్తువుగా గంగిశెట్టి రాసిన 'ది మూన్ బీమ్' (ఓ బుజ్జి ఏనుగు కథ) పెద్ద పెద్ద అక్షరాలతో, రంగురంగుల బొమ్మలతో ఐడ్రీమ్ పబ్లికేషన్స్, USA ప్రచురించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వం శివకుమార్ కథలను పిల్లలకు పాఠ్యాంశాలుగా నిర్ణయించడం గొప్ప విషయంగా చెప్పుకోవాలి. శివకుమార్ పిల్లల కోసం కొన్ని కథలు ఆంగ్లంలో రాశారు. అవి చంపక్, గోకుల్ పత్రికల్లో ప్రచురితమయ్యాయి

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అవార్డు, సమతారావు అవార్డు, ఆం.ప్ర. బాలల అకాడెమీ పురస్కారం తోపాటు బాల కథారత్న, బాలసాహితీ భూషణ్, బాలబంధు, బాలప్రియ, బిరుదులు అందుకున్నారు.


గంగిశెట్టి శివకుమార్ కథల మీద నాదెండ్ల మాధవి, సాహిత్యంపై ఎం. రామలింగయ్య పరిశోధన చేసి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందటం విశేషం. నేడు చాలా పత్రికల్లో సరైన బాలసాహిత్యం రావటంలేదు. పిల్లల్లో బాలసాహిత్యం మంచి గుణాల్ని పెంపొందిస్తుంది. పత్రికలు ఈ దిశగా ఎంతో కృషి చేయవలసి ఉంది" అంటారు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్.

**- పైడిమర్రి రామకృష్ణ**
( కోశాధికారి - బాలసాహిత్య పరిషత్ )
చరవాణి : 92475 64699

## కొప్పర్తి పుస్తకాల ఆవిష్కరణ

జూన్ 29, 2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు
సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం
బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్


అధ్యక్షత
శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు
ప్రముఖ కవి, విమర్శకులు, చిత్రకారులు




చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి
**సంభాషణ**

ఆవిష్కరణ: ఆచార్య వకుళాభరణం రామకృష్ణ
ప్రముఖ చరిత్రకారులు

విశ్లేషణ: శ్రీ దూసనపూడి సోమసుందర్
జాతీయ కార్యదర్శి, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్




మూడు కవిత్వ సంపుటాల సంకలనం
**కొప్పర్తి కవిత్వం**

ఆవిష్కరణ: డా. పాపినేని శివశంకర్
కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత

విశ్లేషణ: శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య
ప్రముఖ కవి, విమర్శకులు

యువకవుల స్పందన: కట్టా సిద్ధార్థ
కడలి

అందరికీ ఆహ్వానం
సాహితీమిత్రులు, హైదరాబాద్

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...


తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# వైవిధ్యభరితమైన కథాకథనాలు

**- కె.పి అశోక్ కుమార్, 97000 00948**

అన్వీక్షకి ప్రచురణ సంస్థలో సాంకేతిక వ్యవహారాల నిపుణుడిగా కనిపించే మహి బెజవాడలో గొప్ప కథకుడు దాగి ఉన్నాడనే విషయాన్ని ఇంతకాలం గుర్తించలేకపోయాను. విస్తృతంగా కథా సాహిత్యం చదివే నాకు ఇటీవల కాలంలో రాస్తున్న కొత్త రచయితల కథలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వీరందరి కంటే భిన్నంగా మహి బెజవాడ రాసిన "గన్స్ అండ్ మాన్సూన్స్" కథలు నన్ను సంభ్రమాశ్చర్యాలకు లోను చేశాయి.

ఆస్తులన్నీ కరిగిపోయినా నాటకాల ప్రదర్శన విడువని కృష్ణారెడ్డి. సినిమాల వల్ల నాటకాదరణ తగ్గిపోతున్న రోజుల్లో " రంగసాని" నాటకం తోనే సరిపెట్టుకుంటున్నారు. ఆ నాటకం తిరగరాయడానికి చనిపోయిన రచయిత కొడుకే పూనుకుంటాడు. కథానాయిక పాత్రకు ఎవరూ దొరకకపోతే, రచయితనే ముందుకు వస్తాడు. ప్రదర్శనలు విజయవంతం కాగా అతని పేరు హీరోయిన్ పేరుతోనే , రంగా గానే స్థిరపడిపోతుంది. రంగసాని నాటకాన్ని రెగ్యులర్ గా చూసే అందమైన కుమారి అనే యువతి ప్రేమ, రంగడి హృదయంలో చెరగని ముద్ర వేస్తుంది. కుమారి తో ప్రేమాయణం నడుపుతున్నాడని ఆమె కుటుంబం రంగాకు దేహశుద్ధి చేసి, కుమారికి పెళ్లి చేసి పంపించేస్తారు. కుమారికి పెళ్లయిందని తెలిసి మనసు విరిగిన రంగాకు, నాటకాలు మూతపడటంతో మద్రాస్ కు వెళ్లి ఒక రచయితకు అసిస్టెంట్ గా, మరొక హీరోయిన్ కు సెక్రటరీగా కుదురుకుంటాడు. ఎక్కడ ఉన్నా కుమారి గురించిన ఆలోచనలే. ఒకరోజు హాస్పిటల్ లో జరుపుకుంటున్న షూటింగ్ లో, చిక్కిపోయి ట్రామాలో ఉన్న కుమారి, పేషంట్ గా కనిపిస్తుంది. కుమారిని చూసి భగ్నమైన ఆమె జీవితాన్ని తెలుసుకొని విలవిలలాడి పోతాడు. ఆమె లెస్బియన్ అనీ, దాని వల్లే ఆమె జీవితం నరకమైందనీ, అందరూ వదిలించుకున్నారని తెలుస్తుంది. ఆమె భర్త చేసిన మారిటల్ రేపు వల్ల ఆమె ట్రామాలోకి వెళ్లిపోయిందని తెలుస్తుంది. ఆమెను బ్రతికించుకోవడానికి రంగా, మళ్ళీ రంగసానిగా ఆమె ముందుకు వస్తాడు. కుమారి ప్రేమించింది రంగానా లేక అతనిలోని స్త్రీత్వాన్నా అన్న సంగతి కథ చదివి తెలుసుకోవలసిందే. ఈ కథలో నాటక సమాజాలు నాటకాలు వేసేవాళ్లు, అప్పటి ప్రేక్షకుల ప్రవర్తన ప్రతిస్పందన, నాటకాలు మూతబడటానికి కారణాలు, నాటకాల వాళ్ల తర్వాతి గమనం సినిమాలు. సినిమాల్లో ప్రవేశించడం గాని, నిలదొక్కుకోవడం గాని ఎంత కష్టమో చెబుతారు. నాటకాలు గానీ, సినిమా గానీ ఆ మోహం లోంచి బయటపడటం అంత సులభం కాదు. ఈ నేపథ్యంలో రూపొందిన ఈ ప్రేమ కథ మనసుకు హత్తుకుపోతుంది.




సహజీవనం లో ఉన్న ప్రియుడు హఠాత్తుగా వదిలేసి, వేరే అమెరికన్ సిటిజన్ తో వెళ్ళిపోవడాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన కూతురుతో ఇలాంటి పరిస్థితులు అందరికీ వస్తాయి. అని నచ్చజెప్పిన తండ్రి తన ప్రేమ కథను వివరిస్తాడు. ఒక ఆంగ్లో ఇండియన్ కుటుంబానికి చెందిన లీలా శాంసన్ సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను ప్రేమిస్తాడు. ఆమెకు దగ్గర కావడానికి ఆమె అన్న శిరిల్ తో స్నేహం చేసి, వాళ్ళ కుటుంబానికి దగ్గరవుతాడు. ఆమెను ఒంటరిగా ఏకాంతంలో కలిసిన మధుర క్షణాలు. ఫుట్ బాల్ ప్లేయర్ గా బలశాలి అయిన శిరిల్ ను అడ్డుకోలేక, స్థానికులకు వాళ్ల మీద ఉన్న చులకన భావంతో అతని తిట్టి రెచ్చగొట్టడం చివరకు అది శిరిల్ హత్యగా పరిగణించడం దాంతో ఆ కుటుంబం అంతా అక్కడి నుండి వెళ్ళిపోవడంతో, తాను భగ్న ప్రేమికుడిగా మారానని చెబుతాడు. "మెమోరీస్ ఇన్ మోనోలాగ్ "అనే ఈ కథలో ఆంగ్లో ఇండియన్ జీవన విధానాన్ని వారిపై కొనసాగే వివక్ష, అవమానాలను వివరించడం బాగా వచ్చింది.

"గన్స్ అండ్ మాన్సూన్స్ " లో ఫోటోగ్రాఫర్ జార్జి తనకు నచ్చిన విధంగానే బతికాడు. అది నచ్చని భార్య రీనా తన ఈగో వల్ల అతన్ని వదులుకుంటుంది. తనకు పుట్టిన కూతురు మేఘ మీద అతడి నీడ కానీ ,జ్ఞాపకాలు కానీ పడకుండా పెంచుతుంది. సవతి తండ్రి మైక్, మేఘను ఎంత ప్రేమగా చూసినా ఎప్పుడూ జార్జి జ్ఞాపకాలలో ఉన్న మేఘ అతన్ని వెతుక్కుంటూ శ్రీలంక వెళుతుంది. అక్కడ కలిసిన నిలా తో తన తండ్రి గురించి, అతని మనస్తత్వం గొప్పదనం గురించి తెలుసుకుంటుంది. స్టిల్ జర్నలిస్టుగా జార్జి , శ్రీలంక ఉగ్రవాదం మీద రీసెర్చ్ చేస్తూ అక్కడే ప్రమాదవశాత్తు మరణించాడని తెలుసుకుంటుంది. లోకం కోసం బ్రతకాలనుకునే యాత్రికుడిగానా? అశాంతితో రగిలిపోయే ఆర్టిస్టుగా నా? ఎలా అర్థం చేసుకోవాలి జార్జిని. జార్జికి ప్రేమించడం తెలియదనుకునే తల్లి రీనా ఫిర్యాదు. అయినప్పటికీ ప్రేమను ఒక్కరికే పంచాలనే విషయం జార్జికి తెలియదని మేఘ గుర్తిస్తుంది. ఇక "కాగజ్ కే ఫూల్" కథలో ప్రేమించి పెళ్లి చేసుకున్న శ్యామ్, సారా లు నిత్యజీవితంలోని ఇబ్బందులు సమస్యలతో వారి మధ్య దూరం పెరిగి చివరకు జెపి ఆత్మహత్య చేసుకుంటాడు. వారి పిల్లలైన శ్యామ్ మీవాల జీవితాలు వ్యతిరేక దిశలో నడుస్తాయి, తల్లిని హత్య చేశాడు అన్న నేరంతో పోలీసులు శ్యామ్ ను అరెస్ట్ చేయగా, శ్యామ్ భార్య తమ కూతుర్ని అతని దగ్గరనే వదిలేసి వెళ్ళిపోతుంది. కూతురు కైరా చిన్నప్పటినుండి తండ్రి వస్తాడేమో అని ఎదురుచూపులతోనే గడిపేస్తుంది. నాన్న నా జీవితంలో ఎప్పుడూ లేడనే నిరాశతో ఉంటుంది. ముఖ్యంగా శ్యామ్ విషయంలో అందరికీ వాడు ఒక ఫెయిల్యూర్ . కానీ స్నేహితులకు మాత్రమే అతడు అశాంతిలో వేగే కళాకారుడు. గొప్ప క్రియేటర్ . జీవితం చేసిన గాయాలను మర్చిపోవాలని, గమ్యం లేని దేశదిమ్మరిలా శ్యామ్ తిరుగుతుంటాడు . శ్యామ్ ను అర్థం చేసుకోవడం ఎవరికీ కుదరదేమో? అయినా ఎవరికైనా ఎందుకు అర్థం కావాలి. ఈ భూమి మీదకు వచ్చాడు పోయాడు. అంతే కదా. వాడు ఎక్కడ ఉంటే అక్కడ ఆనందాన్ని సృష్టించినవాడు, పంచినవాడు. వాడికి ఎవరిమీద కోపం లేదు. వాడికి ప్రేమే ఉంది. కానీ జీవితం చేసిన గాయాలను మరచిపోవాలనుకున్నాడు. ఆ నీడలను తప్పించుకు తిరిగాడు. మనం వాడిని జీవితపు నియమాల తక్కెడ లో తూచాము. అయినా మన దగ్గర వాడిని తూచే రాళ్లు సరిపోవు.

రిటైర్ అయిన 15 ఏళ్లకు సుందర్రావు చనిపోతాడు. మేనమామ అల్లుడుతో కూతురితో ఆమె అత్తగారు అతని వ్యక్తిత్వాన్ని కించపరిచి తమ స్వార్థాన్ని చాటుకుంటారు. ఇద్దరు కొడుకులు, కూతుళ్ళు ఎవరి స్వార్థం వారిది. దోషమంతా రెండవ భార్య మీదనే తోసేస్తారు. ఇందులో ఎవరికి వారు తమ కోణం లోంచే ,తమ స్వార్థ విలువలనుండే సుందరరావు గురించి, సుందర రావు వ్యక్తిత్వం గురించి ఆడిపోసుకుంటారు. చివరగా కృష్ణ మాటలతో అసలు సుందర రావు వ్యక్తిత్వం, అతని రెండో భార్య గొప్పదనం తెలిసి వస్తుంది. రషోమెన్ టెక్నిక్ తో రాసిన ఈ కథ బాగా వచ్చింది.

" ది డెడ్ మ్యాన్ ఈజ్ గోయింగ్ టు సింగ్" లో ఒక ఉద్యమకారుడితో అత్యంత స్నేహంగా మెదిలిన ఒక డాక్టర్, ఒక లైబ్రేరియన్ ,ఒక జర్నలిస్టు సుదీర్ఘ వియోగం తర్వాత కలిసిన క్షణాలవి. సమ సమాజం కోసం చేసిన ఉద్యమమైనా, దళిత ఉద్యమమైనా అవి నెరవేరకుండానే సమసిపోయాయనే సంగతి కథలో అంతర్లీనంగా చిత్రీకరించడం బాగా వచ్చింది. అర్థం లేని అన్వేషణలో తన్ను తాను వెతుక్కోవడం "ఉదారంగు చినుకులు"లో కనిపిస్తుంది. అరాచకంగా బతికే ఒక చిత్రకారుడి కథనే "ఎకోస్ ఆఫ్ మెలాంఖలీ" .ఇది చదువుతుంటే ఎం.ఎఫ్ హుస్సేన్ జ్ఞాపకం వస్తాడు.

ఇవన్నీ ప్రేమ కథలే. వివిధ దేశకాలమాన పరిస్థితుల్లో ఈ ప్రేమ కథలు తీర్చిదిద్దబడినాయి. సఫలమైనట్లు కనిపించినా ఇవి విఫల ప్రేమ కథలే.' వలచి విఫలమొంది విలపించుటయే మేలురా' అన్న బసవరాజు అప్పారావు గారి కవిత వాక్యాలకు అన్వయాన్ని ఈ కథలో వెతకవచ్చు. అయినా విషాదాంత కథలే కదా ఎప్పటికీ గుర్తుండిపోయేది. ఏ నిబంధనలకు, సామాజిక కట్టుబాట్లకు లొంగని విశ్రుంఖలత్వంలో కొట్టుమిట్టాడే కళాకారులే ఈ కథలో కనిపిస్తారు .ప్రేమరాహిత్యం తో బాధపడుతూ తాము పొందిందేమిటో, తాము పోగొట్టుకున్నదేమిటో గుర్తించలేని పరిస్థితుల్లో ఉంటారు. అన్వేషణ. ఎంతకూ అంతుపట్టని అన్వేషణ. అన్వేషణలోని కాలం, వారి జీవితం గడిచిపోతుంది.

విభిన్నమైన శైలి శిల్పాలతో కూడుకొని ఉన్న ఈ కథలలో, కొన్నింటిలో ఫ్లాష్ బ్యాక్ టెక్నిక్ కనిపిస్తుంది. కొన్ని కథలు కొసమెరుపుతో ఉంటాయి. మరి కొన్ని కథలు అసంబద్ధ కథాకథనంతో కూడుకొని ఉంటాయి. అర్థం కాని కొన్ని కథలు ప్రహేళికలను మరిపిస్తాయి. అవి విప్పదీస్తేనే అందులో ఏముందో తెలుస్తుంది. అందుకే ఇలాంటి కథలు తమలో ఏముందో తెలుసుకోమని రెచ్చగొడుతుంటాయి. అందుకే ఈ కథలను మళ్లీ మళ్లీ చదవాలి. చదివి అర్థం చేసుకోవాలి. ఆనందించాలి. ఒక విధంగా ఈ కథలు మన మెదడుకు పరీక్ష పెడతాయి .రొటీన్ గా వస్తున్న కథాకథనాలకు భిన్నంగా వస్తురీత్యా, శిల్పరీత్యా వైవిద్య భరితమైన కథలు అందించిన మహి బెజవాడను అభినందించకుండా ఉండలేకపోతున్నాను.


# పరిణితి కలిగిన కవిత్వం

ఏసి గదిలో కూర్చున్నా/ఉక్కపోస్తోంది/కారణం తెలిసింది. /కవిత రాయలేదీవేళ కవిత్వం రాయకపోతే ఉక్కపోస్తుంది..ఎవరికోసమో కాదు. కొన్ని సంఘటనలు కన్నీరు పెట్టిస్తాయి. కొన్ని ఆనందాన్నిస్తాయి. కొన్ని సంతోషాన్నిస్తాయి కొన్ని ఆలోచనలు కలిగిస్తాయి. మనం ఏ స్థితిలో వున్నా మనల్ని సేదదీర్చేది మాత్రం తెలుగు అక్షరం. తెలుగు భాష. ఎందకనిరాయాలి? రాయకుండా వుండలేని స్తితిలో రాయాలి. ప్రశాంతత కోసం రాస్తాము. రాయగలిగేటంతటి శక్తి వుందని రాయలేము. రా ప్రతి కవిలోనూ రెండు ప్రపంచాలుంటాయి. ఆ రెండు ప్రపంచాలను ఈ రెండు ప్రపంచాల మధ్య సంఘర్షణే కవిత్వమవుతుంది లేదా ఏదో ఒకకళారూపం అవుతుంది.

లహరికి నాకు రెండేళ్ళ పరిచయం. కానీ లహరి కవిత్వంతో కాస్త ఎక్కువే పరిచయం వుంది. ఆర్ధ్రత వుంది. ప్రతి పదానికి అర్థవంతమైన పదప్రయోగం వుంది లహరి మొదట కవిత్వం రాసారు. తర్వాత నానీలు రాసారు. లహరిలో నాకు కనిపించిన గొప్పదనం ఏమిటంటే మొదటి కవితా సంపుటి ''అక్షర నేత్రాలు'' లోనే పరిణితి గలిగిన కవిత్వం రచించింది. తర్వాత నాకు ఇది మొదటిది అని చెబితే నాకు ఆశ్చర్యం వేసింది. ఒక కవి తన కవిత్వం పదికాలాలు నిలిచిపోయేలా వుండాలంటే ఆ కవిత్వం విపరీతమైన వేదనతోటి అయినా వుండాలి లేదా విపరీతమైన ప్రేమతత్త్వం అయినా వుండాలి. ప్రస్తుతం నా ముందున్నది ''స్పర్శలేని శిల'' ఇది అరవై కవితల సంపుటి ఇది. ప్రధానంగా లహరి కవిత్వాన్ని చదువుతుంటే నాకేమనిపించింది అంటే రాబోయే తరానికి కవయిత్రులలో వీరి ముద్ర వుంటుందని. ఉదాహరణకు లహరి కవిత్వాన్ని పలకరిద్దాం..

''సూఫీగా మారేందుకు సాఫీగా సాగిన ప్రయాణమేం కాదిది. అంటారు నువ్వేం ఎగురుతావ్ అని హేళనగా నవ్విన ఆంక్షలు/ ఊహల రెక్కల్ని కత్తిరించినప్పుడు / కొన్ని చేతులు కొత్త రెక్కల్ని తొడిగి / ఆకాశపు హద్దులను చేరేలా వెన్నుతట్టాయి'' నీవల్ల కాదని వెక్కించిన నాల్కలు/ గేలిమాటలతో మనసును గాయపరిస్తే / మరికొన్ని చేతులు కంచెల్ని తెంచి చల్లటి మాటల లేపనాన్ని అద్దాయి'' ఈ కవిత్వంలో వున్న వేదనంతా ఇదే. ఈ అమానవీయత ఎందుకు? అనే ప్రశ్నే కనిపిస్తుంది. కవికి తడి ఎక్కువ. గుండెలో తడిని గ్రహించాలి. ఆధునిక కవిత ఒకచోట మొదలై మరొకచోట పూర్తవుతుంది. కవిత్వంలో ఎన్నో సమాదానాలున్నాయి. ఎన్నో ప్రశ్నలున్నాయి. తాను ఏ సమాధానికి చేరుకున్నాడో చూస్తే ఆ కవియొక్క మానసిక స్థితిని మనం గ్రహించవచ్చు.

లహరి రాసిన కవిత్వంలో ఒకచోట నిర్వాసితుల్ని గురించి ప్రస్తావిస్తూ ''వేకువతో పనిలేదు/ చీకటితో పేచీలేదు/కసురుకునే వాకిళ్ళెన్నో/తెరుచుకోని తలుపులెన్నో'' చివరిగా ''ఏ మురికి గుంటల పక్కనో/ ఏ




బస్టాండ్ చెత్తకుప్పల పక్కనో/జనాభా లెక్కల్లోకి ఎక్కకుండా/ ఆఖరి పోరాటం సాగిస్తున్న ఒంటరి పిట్టలువాళ్లు'' అంటుంది. మొట్ట మొదటగా ప్రతి కవి దు:ఖంలోకి వెళతాడు. అంటే పారడైస్ లాస్ట్.. అనే పదాలకంటే గొప్ప కావ్యం ఈ ప్రపంచంలో లేదు..

మది తడిపిన ఆవేదన కవితలో ఒకరిని నమ్మడమే తప్పా? ఒకరిని గురించి ఆలోచించడమే తప్పా? వింత సమాజంలో వున్న వికృత మనసుషులు కొందరు ఆర్థికంగా మోసం చేస్తే, మరికొందరు హార్థికంగా మోసం చేస్తారు చెబుతూనే కొన్ని వాక్యాలు తెలియజేస్తూ చివరిలో అంటారు కదా? ''చెట్టుకు చీర చుట్టినా చొంక కార్చే / కామాంధులకు ఇక్కడ కొదవలేదు/ చుట్టూ పువ్వుల మనసులు అనుకుంటే/ వికృత కరతుమ్మ ముల్లుల తాకిడికి/ రక్తం ఓడుతోంది. / హార్థికాలన్నీ ఆర్థికాలై పరిహసిస్తున్నై/ బలికాకముందే నిద్రలేవాలి/ చైతన్యమే సాహసంగా ముందడుగు వెయ్యాలి'' అనడంలో నేనన్నట్లు సమాధానంలో కవి సామర్థ్యం, మానసిక స్థితి మనకి అర్థమవుతుంది.

ప్రపంచం ఇప్పుడు/ అశాంతితో తాండవమాడుతోంది/ రాజ్యాలు యుద్ధాన్ని తవ్వి/ మనుషుల్ని పాతేస్తున్నాయి/స్వార్థం అడుగు పడని చోటు/ కనుచూపు మేరలో లేదు/ సంకుచిత మనస్తత్వం/ ఈర్ష్య అసూలలు అన్నదమ్ములై జనాల భుజాలమీద ఊరేగుతూ ఆధిపత్యపు వికృత ధోరణులతో/ ధనసంపదే ధ్యేయంగా బతుకుతున్నవైనం'' ఇలా ప్రతి కవితలో వేదన కనిపిస్తుంది. వేదన ఏదయినా సమాజానికి సంబంధించింది. కవి ఎప్పుడూ సమాజాన్ని తరచి చూసే కదా రచించేది. జీవితాలన్నీ ఒకటే. కాకుంటే కొన్ని ఎక్కువ వేదనలతో నిండివుంటాయి. మరికొన్ని తక్కువ వేదనలను అల్లుకుని వుంటాయి. అదే వీరు చెప్పాలని ప్రయత్నించింది.

''నేను మరణించుచున్నాను.. నేను మరణిస్తుంటే చమ్మగిల్లు నయనంబు లేదు.'' అన్న ఒక మహాకవి అన్నట్లుగా ఒక కవిత చదివితే అది రాత్రంతా స్వప్న దీపం కావాలి. నువ్వు భావుకుడివైతే నీవు బతికిన క్షణాల్ని నువ్వు పట్టుకోగలిగితావు. అపుడు నీ బతుకును నీవు మరింత వృద్ధి చేసుకోగలవు. ఎలాగైతే ఒక క్యాన్సర్ రోగి తనలోని నిర్జీవమైన కణాల్ని గుర్తుపట్టి వాటిని నిర్మూలం చేయడం జరుగుతుందో అలాగే మనలోని నిర్జీవమైన క్షణాల్ని గుర్తించగలిగితే వాటిని బతికించుకునే మార్గం కనిపిస్తుంది కదా అనిపిస్తుంది. అదే కోవలో లహరి వేదన శాశ్వతం కాదు. వేదనను దాటడానికి అనేక వంతెనలున్నాయని తెలియజేసింది

జ్ఞాపకాల వంతెన..(మనిషికి మనిషికి మధ్య బంధాన్ని గురించి), తంగేడు పూలు (బడికి పోవాలనే ఆశ వుండే/సదువుమీదనే ధ్యాస వుండే/ గాసారం మంచిగ లేక సదువు మానేసిన/ నిన్ను మాత్రం నా తీరుగ కానియ్య బిడ్డా''ధైర్యమనే రాయిని నీ చేతికిస్తున్నా/ కాలం నీవైపు మొగ్గు సూపేదాంక నిరీక్షించు'' అనడం ఎంతో హృద్యంగా వుంది


దేహమెపుడూ రెండు ఖండన బిందువుల్లా వుంటుంది. ఆత్మ వేదనతో తడిసిపోతుంటుంది. అందుకే లోపల తడిగా. బయట పొడిగా మిగిలిపోతుంది. మనిషి జీవితం చీకటిని గడపాలి. చీకటి నడవాలి. ఇది గడిచిపోతుంది. తెల్లవారుతుంది. తెల్లవారితే సూర్యుడు భగభగలాడుతూ వస్తుంది.

జ్ఞాపకాల గుప్తనిధి మా ఇంటి అరుగు/ జీవితంలో కష్టసుఖాల్ని తన గుండెల్లో దాచుకుని ప్రేమాప్యాయతలను ఒలకపోసే/ఊటబావి మా ఇంటి అరుగు'' `రాజకీయాలైనా, జానపదాలైనా/రంగస్థల ప్రదర్శనలైనా, వీధి నాటకాలైనా / అన్నింటికీ సజీవ దృశ్యరూపకం/ మా ఇంటి అరుగు'' చివరిగా దూరమైన ఆ తీపిగుర్తుల జాబితాలో /అంతరించిన ఇంటి అరుగు స్మృతులు/ ఇప్పటికీ ఒక జ్ఞాపకంగానే మిగిలిపోయాయి.''

అంటూన్న వీరి కవితలు చదివినవారికి తెలియని భావాలేవో వెంట తరుముతాయనడంలో అతిశయోక్తి లేదు. కవయిత్రి లహరికి ఇప్పటికే కవిత్వంలో అనేక బహుమతులు వచ్చాయి. రచించిన గ్రంథాలకు పురస్కారాలు వచ్చాయి అంటే ఆ కవిత్వంలో ఎంతటి సాంద్రత వుందో మనం అర్థం చేసుకోవాలి. వీరి ప్రతి కవితా సందేహం, సందేశం మధ్యలో ఊగిసలాడుతూ జీవితం పట్ల ఎదుటివారికి ఏదో బోధచేస్తున్నట్లుగా వుంటుంది. ఇంకా వీరి కవితలు, విలోమ దృశ్యం, ఊరు మారింది, విగత జీవుల మధ్య, సముద్రం, విరామ సమయం

అమ్మమ్మ లేని ఇల్లు వంటివి గుర్తుండిపోయేలా రచించారు. లహరి మరిన్ని కవితాగ్రంథాలను రచిస్తారని భావిస్తూ అభినందిస్తున్నాను.

**-శైలజామిత్ర**



# బల్లి - నేను

గోడ మీద బల్లిని చూస్తుంటే
నా గుండె మీద
ఉన్నట్టే అనిపిస్తుంది

పిల్లి కళ్ళు మూసుకొని
పాలు తాగినట్టే ఉంటుంది
నా పరిస్థితి

నేను లైట్ ఆర్పేసినాను
కదా అనుకుంటాను
నాలోని చీకట్లకు
బల్లి సాక్ష్యంగా ఉంటుంది

అది అన్నీ వింటుంది
అన్నీ చూస్తుంది
అయినా పురుగును మింగేసి
ఏమీ ఎరుగనట్టుగా
నాలాగే మౌనంగా ఉంటుంది

నా కళ్ళల్లోకి అది మౌనంగా
నిర్భయంగా చూస్తుంటుంది
మనిషిగా దాని ముఖంలోకి
చూడాలంటే నాకే భయం

నేను బల్లిగా పుట్టి ఉంటే
మేమిద్దరం
మంచి ప్రేమికులం అయ్యేవారం

- పర్కపెల్లి యాదగిరి,
9299909516

# కొత్త స్కూళ్ళు కాదు.. ఉన్నవాటినే బాగుచేయండి


## టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి




**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో పబ్లిక్ స్కూళ్ళు, సమీకృత గురుకులాల పేరుతో కొత్త స్కూళ్ళను నెలకొల్పడం కాదు, ఉన్న స్కూళ్ళనే బాగు చేసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ డైట్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పదేళ్ళ కాలంలో ప్రభుత్వ విద్యారంగం వివక్షతకు గురైందని, దాదాపు 8 లక్షల విద్యార్థులు ప్రైవేటుకు తరలివెళ్లారని అన్నారు. గత సంవత్సరం 16 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతిలో 1 లక్షా 20 వేల మంది చేరితే, 11 వేల ప్రైవేటు పాఠశాలల్లో 5 లక్షల మంది విద్యార్థులు చేరారన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, కెజి తరగతులు ఉండడం కూడా దీనికి ఒక బలమైన కారణం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం వెనుకడుగు వేస్తోందని అన్నారు. కేవలం 250 పాఠశాలల్లో మాత్రమే పూర్వ ప్రాథమిక తరగతులకు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంచి అభివృద్ధి చేయాలి తప్ప కొత్త పాఠశాలలను ప్రారంభించడం అనాలోచిత నిర్ణయం అన్నారు. దీనివల్ల నష్టమే తప్ప లాభం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యతను తీసుకోవాలనీ, అందుకు అవసరమైన ప్రయత్నాలు మొదలుపెట్టాలని వారు కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలనీ, హెల్త్ కార్డ్స్ ప్రయోజనాలు అందేలా చూడాలనీ, పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలనీ, పిఆర్సి అమలుకు ముందుకు రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన రేట్లను పెంచాలనీ, వారి బిల్లులు సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కె. కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి. అశోక్, ఉపాధ్యక్షులు టి.సూర్య కుమార్, కోశాధికారి కె. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు ఎ.స్వామి, ఎ.ఇస్తారి, గౌస్ మొహియుద్దీన్, ఇ శివన్న, కె గణేష్, సోషల్ మీడియా కన్వీనర్ కె శంకర్, జిల్లా కమిటీ సభ్యులు, మండలాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

# కాంగ్రెస్ పార్టీని వీడిన నాయకులు, కార్యకర్తలు

- సబిత సమక్షంలో బిఆర్ఎస్ లోకి యువ నాయకుడు రాఘవేందర్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం లేదనే ఘాటు వాఖ్య
- బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న పలువురు కార్యకర్తలు
- జిల్లాలో జంపింగ్ నాయకులు ఇంకా ఉన్నారా?
- ఓఆర్ఆర్ రైతు ఖాతాలో రైతు భరోసా నిధులు జమ చేయాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మన్సాన్పల్లి గ్రామంలో రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో వందమందికి పైగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సవిత ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం మనసాన్పల్లి గ్రామ నాయకులు ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డికి ఘన స్వాగతం పలికారు. యువ నాయకుడు రాఘవేంద్ర రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా బిఆర్ఎస్ కండువా కప్పుకుని పార్టీలో చేరడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైందంటూ ప్రభుత్వంపై, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు అందరూ కేసీఆర్ వైపు వస్తున్నారు. రైతులు కెసిఆర్ ను ముఖ్య మంత్రిగా కోరుకుంటున్నారని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగారెడ్డి ల పేరుతో అధికారంలోకి వచ్చి పేద ప్రజలను నట్టేట ముంచిందని వారిని పట్టించుకున్న పాపాన పోలేదని పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

### ఓఆర్ఆర్ రైతు ఖాతాలో రైతుభరోసా నిధులు జమ చేయాలి

రైతులకు వానాకాలం పంట పెట్టుబడి సాయం కొంతమందికే అందించి మరికొంతమందికి మొండి చేయి చూపడం జరిగిందని ఆమె మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని రైతులకు రైతు భరోసా నిలిపివేయడం ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమని రైతుల పట్ల కక్ష సాధింపు చర్యలు తగదని ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రతి ఒక్క రైతుకి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆ పార్టీ యొక్క విధివిధానాలు, ఒంటెద్దు పోకడలు నచ్చక, కెసిఆర్ పాలనలోనే రైతులకు న్యాయం జరిగిందని, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని నమ్మి, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుతూ పార్టీలో చేరడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుందని కొందరు నాయకులు బెదిరిస్తూ, కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, ఇలాంటి రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. పైన ఏ ప్రభుత్వం ఉన్న ఇక్కడ మీ ఆశీస్సులతో సబితమ్మ ఉంది అని అన్నారు. ప్రజల సొమ్ముతో ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నారు. గాంధీ భవన్ నుంచి ఏమైనా ఇస్తున్నారా అని ప్రభుత్వంనీ ప్రశ్నించారు. మన్సాన్పల్లి గ్రామం నుండి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ లో చేరడంతో, మహేశ్వరం మండలంలో పార్టీకి మరింత బలం చేకూరిందని అన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం లేదు

రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో శూన్యం అన్నారు. 16 నెలలు గడుస్తున్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం లేదని అందుకే బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మేమున్నాం అనే ధైర్యాన్ని కల్పించిన స్నేహితులు

## స్నేహితుడి కుటుంబానికి లక్ష ఆర్థిక సాయం

**రంగారెడ్డి జిల్లా మహా:** యాచారం మండలం అయ్యవారిగూడ గ్రామానికి చెందిన కొప్పు అశోక్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు 2001-2002 పదవ తరగతి బ్యాచ్ తన స్నేహితుడి కుటుంబానికి తమ వంతు సహాయం చేయాలని సదుద్దేశంతో, స్నేహమంటే బ్రతికుండగా చటపట లేసుకొని తినడం కాదు, స్నేహితులు మరణించిన తర్వాత కూడా తన కుటుంబానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్న బాల్య మిత్రులు, తమతో పాటు చదువుకున్న మిత్రులందరిని కలుపుకొని, తోటి స్నేహితుడైన అశోక్ కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల ఆర్థిక సహకారాన్ని అందించారు. భవిష్యత్తులో కూడా తమ పిల్లల చదువుల విషయంలో ఎలాంటి సహకారం కావాలన్నా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని వారికి ధైర్యాన్ని కల్పించారు. తమ బ్యాచ్ లో ఏ ఒక్కరికి ఆపద వచ్చినా సహాయం చేయడంలో ముందుటామని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... మా కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా, నడకతో సంపూర్ణ ఆరోగ్యం

## వయో వృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్ పాండే




**ఆదిలాబాద్, మహా:** వయోవృద్ధులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా నిత్యం ధ్యానం, యోగా, వాకింగ్ చేయాలని వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్ పాండే అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ ప్రముఖ డయాగ్నిస్టిక్ కేంద్రం నిర్వాహకులు, డయాగ్నోస్టిక్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ ప్రఫూల్ వర్ఘే ఆధ్వర్యంలో వయోవృద్ధుల సమాఖ్య కార్యాలయంలో మధుమేహంపై అవగాహన కల్పించారు. మధుమేహం ఎలా వస్తుంది... ఎలా నివారించాలి... పరీక్షలు ఏ విధంగా చేసుకోవాలనే దానిపై వారికి అవగాణ కల్పించారు. మధుమేహం వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. మరోపక్క మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా డీడబ్ల్యూఓ సిబ్బంది మత్తు పదర్థాలపై సమాఖ్య సభ్యులు, వృద్ధులకు అవగాహన కల్పించారు. అనంతరం నశముక్త్ భారత్ పేరిట అవగాహన ర్యాలీని నిర్వహించారు. వయోవృద్ధుల సమాఖ్య కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలో కొనసాగింది. ఈ సందర్భంగా దేవిదాస్ దేశ్ పాండే మాట్లాడుతూ వయసు పై బడుతున్న వారిలో క్రమంగా వ్యాధులు కూడా వస్తాయని, వాటిని నివారించేందుకు నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వయోవృద్ధుల సమాఖ్య కార్యదర్శి రాంకులకర్ణి, చిల్కూరి లక్ష్మారెడ్డి, గుండా వామన్రావు. హన్మంత్రెడ్డి, గంగారధ్, అఫ్సార్ ఖాన్, నశముక్త్ భారత్ సీఈ సాయికిరణ్, డీడబ్ల్యూఓ ఎఫ్తార్ పోశెట్టి, డవ్ నిర్వహకులు దేవేంద్ర తదితరులున్నారు.

# కాలేజీ విద్యార్థులకు డిఐఈఓ సర్టిఫికెట్లు ఇవ్వాలి

## పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి శ్రీకాంత్ డిమాండ్



**మంచిర్యాల, మహా :** ఇటీవల అర్ధాంతరంగా మూతపడిన మంచిర్యాల ప్రతిభ కాలేజీ కు సంబందించిన విద్యార్థుల సర్టిఫికెట్స్ ను అధిక ధరలకు విక్రయించడాన్ని పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి శ్రీకాంత్, మంచిర్యాల ఉపాధ్యక్షులు సికిందర్ లు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపల్ సంతకం లేకుండా ఆకుల కిరణ్ అనే వ్యక్తి విద్యార్థుల గృహాలకు వెళ్లి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయం అంతా విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలిసిన వారు పట్టించుకోవడంలేదని వాపోయారు. తక్షణమే ప్రతిభ కళాశాల సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకొని విద్యార్థులకు ఎలాంటి ఫీజులు లేకుండా ఇచ్చే విధంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధం గా ప్రతిభ జూనియర్ కళాశాల ఫస్ట్ ఇయర్ పూర్తిచేసుకుని, సెకండ్ ఇయర్ కు వెళ్లే విద్యార్థులు లను మంచిర్యాల లోని ఒక కళాశాల కు ఒక్కొక్కరికి 4 వేల రూపాయల చొప్పున మహేందర్ రెడ్డి అమ్ముకున్నాడని ఆరోపించారు. కళాశాలలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు వారికి నచ్చిన కాలేజీ లో అడ్మిషన్ తీసుకొనే విధం గా బదిలీ ధ్రువ పత్రాలు అందజేయాలని అన్నారు. ఈ విషయంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని వారు కోరారు.

# దేశం కోసం దేశ ప్రజల అభివృద్ధికై మోదీ సర్కార్

- ప్రజా సమస్యలపై రచ్చబండ కార్యక్రమాలు బీజేపీ
- రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోస్ పల్లి ప్రతాప్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భారతీయ జనతా పార్టీ ఇబ్రహీంపట్నం మండలం పార్టీ అధ్యక్షులు గోదాల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన 11 సంవత్సరాల పాలనా కార్యక్రమానికి, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోస్ పల్లి ప్రతాప్, ముఖ్యఅతిథిగా హాజరై కప్పపహాడ్ గ్రామంలో పేద ప్రజల కష్టాలను తెలుసుకోవడం కోసం రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకోవడం జరిగినది. అనంతరం గ్రామంలో మొక్కలు నాటి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. బోస్ పల్లి ప్రతాప్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. దేశంలో బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో దేశం కోసం, దేశ ప్రజల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం మోడీ తీసుకున్న నిర్ణయాలు అమోఘమని ఆయన కొనియాడారు. దేశ రక్షణకై, దేశ ప్రజల అభివృద్ధి లక్ష్యంగా మోడీ సర్కార్ దేశంలో కొనసాగుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి నరసింహారెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి నిట్టు శ్రీశైలం, బిజెపి జిల్లా కార్యదర్శి పొట్టి రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉడుతల నరసింహ, ఇబ్రహీంపట్నం మండల మాజీ అధ్యక్షులు దండే శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# మైనర్ బాలికపై ఎనిమిది మంది లైంగిక వేధింపులు

**అదిలాబాద్, మహా:** ఓ మైనర్ అమ్మాయిపై ఎనిమిది మంది లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకుఒక మైనర్ అమ్మాయితో చిన్ననాటి నుండి స్నేహం పేరుతో దగ్గరై అమ్మాయితో సోషల్ మీడియాలో సెల్ ఫోన్ సహాయంతో మైనర్ యువకుడు చాటింగ్ చేశారని తెలిపారు. ఆ మైనర్ అమ్మాయితో చేసిన చాటింగ్ ను తల్లిదండ్రులకు ప్రజలకు తెలియజేస్తానని బెదిరించి, అమ్మాయితో నగ్నంగా వీడియో కాల్ చేయాలని బెదిరించి, దానిని రికార్డు చేసి, మైనర్ అమ్మాయి వీడియోను తన స్నేహితులకు ఒకరి తర్వాత ఒకరికి పంపించి రాక్షసానందం పొందారని తెలిపారు. అమ్మాయిని లైంగికంగా మానసికంగా వేధించిన ఎనిమిది మంది సజ్జన్వార్ వంశీ కృష్ణ(20), పవార్ తరుణ్(18),సాబ్లే బలవంత్ సింగ్(18), గుండల్వార్ వరుణ్, కారడ్ సుధీర్(28),ముర్కుటే విట్టల్, మరో ఇద్దరు మైనర్ లపై బాధితురాలి ఫిర్యాదు మేరకు గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ లో పోక్సో కేసు నమోదు అయిందని వెల్లడించారు. షీటీం బృంద సహాయంతో, గుడిహత్నూర్, ఇచ్చోడ పోలీసులు సీఐ బండారి రాజు ఆధ్వర్యంలో ఎనిమిది మందిని అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. అందులో ఇద్దరు మైనర్ లు ఉండగా వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రిమాండ్ కు తరలించడం జరిగిందని పేర్కొన్నారు. మహిళలకు అండగా ఆదిలాబాద్ షీ టీం బృందం ఎల్లవేళలా సహకరిస్తుందని, మహిళలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా 8712659953 నెంబర్ కి సంప్రదించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలు చేసే పనులపై ఓ కంటితో కనిపెడుతూ ఉండాలని, వారి ప్రతి ఒక్క అంశాన్ని పరిగణిస్తూ ఉండాలని పేర్కొన్నారు.



# గుండెపోటుతో కానిస్టేబుల్ ప్రకాష్ మృతి

**ఆదిలాబాద్,. మహా** ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న 1998 బ్యాచ్ కు చెందిన కానిస్టేబుల్ పద్మావార్ ప్రకాష్ గుండె పోటుతో మృతిచెందాడు. ఆదివారం ఉట్నూరు నుండి ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు కోర్టు విధుల నిమిత్తం వస్తున్న సందర్భంలో ప్రయాణంలో బస్సులో గుండెపోటు వచ్చింది. ఇంద్రవెల్లి వద్దకు రాగానే అంబులెన్స్ లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణికులు, సిబ్బంది సిపిఆర్ చేసి బతికించే ప్రయత్నం చేసిన ఎలాంటి ఉపయోగం లేక పోయింది. అప్పటికే మరణించారని రిమ్స్ వైద్యులు ధృవీకరించారు. ఈ సందర్భంలో ఉట్నూర్ కు చెందిన ప్రకాష్ అంత్యక్రియలలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా పాల్గొని పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... సిబ్బందిని కోల్పోవడం బాధాకరం అని తెలుపుతూ, యుక్త వయస్సులో ఎలాంటి అనారోగ్య బారిన పడకుండా సిబ్బంది వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉండాలని తెలిపారు. తక్షణ సహాయం కింద కుటుంబ సభ్యులకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.30 వేలను అందజేసినట్లు తెలిపారు కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలిగిన, ఎలాంటి సమస్యలున్న జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. మృతిచెందిన ప్రకాష్ కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు సిహెచ్ కరుణాకర్ రావు, జి మొగిలి, ఎస్సై మనోహర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సహకారం సమగ్ర గ్రామాభివృద్ధికి పునాది




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాక్ థాన్ కార్యక్రమానికి టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు ప్రారంభించారు. అంతర్జాతీయ సహకార దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని, తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లో నిర్వహించిన వేడుకల్లో, ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, జెండా ఊపి వాక్ థాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 కింద ఈ వేడుకలను జరుపుకుంటున్నామని అన్నారు. సహకార సంస్థల పాత్రను వాటి ప్రయోజనాలను సామాజిక ప్రభావాన్ని విశ్వవ్యాప్తంగా తెలియజేయడం దీని యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. 2012 లో మొదటి అంతర్జాతీయ సహకార సంవత్సరం నిర్వహించడం జరిగింది. మళ్లీ 13 సంవత్సరాల తర్వాత ఈ వేడుకలు నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు, రాష్ట్రం మొత్తం ఈ వేడుకలను నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. నాబార్డ్ మరియు రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతినిధులు ఈ అంతర్జాతీయ సహకార వేడుకల్లో పాల్గొంటున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లా సహకార బ్యాంకులో (DCCB), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(PACS), రుణ, సరఫరా, మార్కెటింగ్, డైరీ, హౌసింగ్ వంటి అనేక రంగాల్లో సహకార సంస్థలు విజయవంతంగా నడుస్తున్నాయని గుర్తు చేశారు. తెలంగాణలో మహిళా సహకార సంఘాలు స్వయం సహాయక సమూహాలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయి. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకార సంఘం ద్వారా రుణాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. యువతకు సహకార రంగాల్లో శిక్షణ ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలు సహకార సంస్థల సహకారంతో సమర్థవంతంగా అమలవుతున్నాయి. అందుకే సహకార భావనతోనే సమాజ అభివృద్ధి సాధ్యం అనే నినాదంతో, సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలపాలని వారు ఆకాంక్షించారు.



# కిషన్ రావుపల్లిలో అగ్ని ప్రమాదం ఇల్లు దగ్ధం

**కాటారం , మహా :** భూపాలపల్లి జిల్లా మలహర్ మండలంలోని కిషన్ రావు పల్లి గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ తో జరిగిన అగ్నిప్రమాదంలో కాగితపు బాపుకు చెందిన ఇల్లు పూర్తిగ కాలిపోయింది. వడ్రంగి పనిచేస్తూ జీవిస్తున్న బాపుకు ఆ ఇంట్లో ఉన్న వడ్రంగి పనిముట్లు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. గ్రామ ప్రజలు మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. సంఘటనా స్థలాన్ని మాజీ ఎంపీపీ మలహర్రావు సందర్శించారు. బాధితున్ని ఓదార్చారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించేలా కృషి చేస్తామన్నారు.

# ప్రజల భద్రతే మా ధ్యేయం




## మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి

**మంచిర్యాల, మహా :** ప్రజల భద్రతే మా ధ్యేయమని మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్.వి. దేవాలయం ఆవరణలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం 'ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు కాలనీలోని అనుమానిత ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాకు కొత్తగా వచ్చిన వ్యక్తుల వివరాలను సేకరించడంతో పాటు, సరైన ధ్రువపత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలను, 4 త్రిచక్ర వాహనాలను (ఆటోలు) సీజ్ చేశామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ నేర నిర్మూలన సాధ్యమని అన్నారు. కాలనీలో అపరిచితులు, నేర చరిత్ర కలిగిన వారు ఆశ్రయం పొందుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యాంటీడ్రగ్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా, మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఒక మహిళ ఇంటిపై దాడి చేసి, అమ్మకానికి సిద్ధంగా ఉన్న 8 లీటర్ల ప్రభుత్వ నిషేధిత గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. సదరు మహిళపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు. కాలనీల స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీనికి పోలీసుల పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్, అదనపు ఎస్సై శ్రీనివాస్, రామకృష్ణాపూర్ అదనపు ఎస్సై లలిత, ఇతర పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

## భూపాలపల్లి ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్




**భూపాలపల్లి, మహా :** యువత డ్రగ్స్ డ్రగ్స్ వంటి ప్రమాదకర మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కావద్దని వాళ్లపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, యువకులు అప్రమత్తంగా ఉంటూ, డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భూపాలపల్లి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. భూపాలపల్లి లో గల అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడారు. "యువత దేశ భవిష్యత్తు ఏ విధంగానైనా మత్తు పదార్థాలకు బానిసలైతే, అది వారి వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా, సమాజాన్ని కూడా చిద్రం చేస్తుందని, మత్తు పదార్థాలు తాత్కాలిక తృప్తిని కలిగించినప్పటికీ, దీర్ఘకాలికంగా శారీరక, మానసిక, ఆర్థిక నష్టాలను కలిగిస్తాయి." ప్రతి యువకుడు/యువతి తమ జీవిత ప్రయోజనాల్ని గుర్తించుకొని, ఇలాంటి వ్యసనాల నుంచి దూరంగా ఉండాలని సి ఐ నరేష్ కుమార్ అన్నారు. చదువు, ఉద్యోగం, కుటుంబం వంటి జీవిత పునాదులను మత్తు పదార్థాలు నాశనం చేస్తాయి. అందుకే 'డ్రగ్స్‌కు నో' చెప్పడం అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలని తెలిపారు. పోలీసు శాఖ తరపున మేము నిరంతరం డ్రగ్స్ వ్యసన వ్యతిరేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు, ఇలాంటి భయంకర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు, సహకరిం చాలని భూపాలపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ కోరారు.

# ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని ఆరోగ్యంగా జీవించండి

- మైదానం ఉంటేనే కళాశాలలకు అనుమతులు ఇవ్వాలి
- ప్రతి పాఠశాలలో పి ఇ టీ లను నియమించాలి
- ఒలింపిక్ డే రన్ లో పాల్గొన్న జంగా రాఘవరెడ్డి



**హన్మకొండ మహా;** ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తుల బదులు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చేందుకు ప్రతి ఇల్లు క్రీడల్లో భాగస్వామ్యం కావాలని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం జరిగిన 39వ ఒలింపిక్ డే రన్ ముగింపు కార్యక్రమానికి జంగా రాఘవరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి క్రీడల పట్ల ఆకర్షితులయ్యేందుకు పాఠశాల దశ అత్యంత కీలకమని దురదృష్టవశాత్తు అన్ని పాఠశాలలు, కళాశాలలో కనీసం మైదానాలు లేకపోవడం శోచనీయమన్నారు. మైదానాలున్న విద్యాసంస్థలకు మాత్రమే అనుమతిస్తూ వ్యాయామ విద్య సంభందించిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా నియమించుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం క్రీడా రంగాన్ని నిర్లక్ష్యానికి గురి చేసిందని స్వతహాగా క్రీడాకారుడైన సీఎం నేతృత్వంలో క్రీడాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు మహ్మద్ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ ఒలంపిక్ సృష్టికర్త క్యుబర్టీన్ అందించిన ఒలింపిక్ స్పూర్తితో ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలన్నారు. ఒలంపిక్ ఆవిర్భావం, క్రమానుగతంగా వచ్చిన మార్పులను వివరించారు. ఒలింపిక్ స్పూర్తితోనే దేశాల మధ్య రాచరిక ఆదిపత్యం బదులు స్నేహ సౌభ్రాతృత్వం వెల్లువిరిసిందన్నారు. ఆస్తులు వెంబడి పరిగెడితే ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని జీవిత చరమాంకంలో సంపాదించిన డబ్బులు ఆసుపత్రులకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానాన్ని రూపుమాపేందుకు సర్వత్ర ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలోని అన్ని క్రీడా సంఘాల సహకారంతో ప్రతి సంవత్సరం నగరంలో ఒలింపిక్ డే రన్ విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి క్రీడా శిక్షణలో పొందిన స్పూర్తితో నిత్యం స్టేడియంకు వచ్చే క్రీడాకారులు, తల్లిదండ్రుల సంఖ్య పెరగడం సంతోషదాయకం అన్నారు. అనంతరం కాళోజీ కూడలిలో ఒలింపిక్ డే రన్ ను జంగా రాఘవరెడ్డి , అజీజ్ ఖాన్ లు జెండా ఊపి ప్రారంభించారు. కాలేజీ జంక్షన్ నుండి అంబేద్కర్ చౌరస్తా, ఏషియన్ మాల్ మీదుగా స్టేడియం వరకు దాదాపు 600 మంది రన్ కొనసాగింది. విచ్చేసిన అతిథులు క్రీడాజ్యోతిని చేతబూని ఉత్సాహంగా రన్ లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు ,కాంగ్రెస్ నాయకులు, వివిధ క్రీడ సంఘాల బాధ్యులు, రామప్ప స్పోర్ట్స్ అథారిటీ కోచ్ లు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు, వాకర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# తెలుగు సినీ గేయ సాహిత్యాన్ని దాశరథి సుసంపన్నం చేశారు

## శతజయంతి సాహితీ మూర్తులు దాశరధి ఆరుద్ర



**రంగారెడ్డి జిల్లా మహా:** ఖమ్మం ఎస్సార్ బి జీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో " శతజయంతి సాహితీ మూర్తులు దాశరధి, ఆరుద్ర జీవితము సాహిత్యం " అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతల రాకేశ్ భవాని హాజరై "దాశరధి సినిమా పాటలు ఒక పరిశీలన " అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేశ్ భవాని మాట్లాడుతూ... పాటల పయోనిధిగా, సినీగీతాల వారధిగా తెలుగు సినీ గేయ సాహిత్యాన్ని దాశరధి సుసంపన్నం చేశారన్నారు. దాశరధి సినిమా పాటలను పాడుతూ వాటిని విశ్లేషించారు. విశ్వవిద్యాలయ స్థాయిలో దాశరధి సినిమా పాటల పై మరిన్ని పరిశోధనలు రావలసిన అవసరం ఉందన్నారు. అనంతరం సదస్సు నిర్వాహకులు డా .రాకేశ్ భవానిని సత్కరించారు.

# శ్రీ భద్రకాళీ అమ్మవారికి కోటి రూపాయలతో రథం

## సమావేశంలో ఆలయ పాలకమండలి తీర్మానం



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ప్రముఖ ప్రాచీన ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో తేదీ: 26062025 గురువారం నుండి 15 రోజుల పాటు నిర్వహించే శాకంభరీ నవరాత్ర మహోత్సవ ఏర్పాట్ల పై చర్చా సమావేశం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ బి శివసుబ్రహ్మణ్యం (చైర్మన్) అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి (ధర్మకర్తల మండలి) కంచి కామాక్షి, అమ్మవారి రథాన్ని పోలిన రథాన్ని శ్రీ భద్రకాళీ అమ్మవారికి ఒక కోటి రూపాయలతో తయారు చేయించడానికి ఈ సమావేశంలో తీర్మానించారు. అమ్మవారి ఆలయం చుట్టూ మాడవీధుల నిర్మాణం పూర్తవుతున్నందున ఇకపై అమ్మవారికి జరిపే వాహన సేవలు, రథ సేవ ఇత్యాదులు మాడవీధుల గుండానే జరుపుతారు. ఇప్పటి వరకు ఆలయానికి మాడవీధులు లేనందున ప్రదిక్షిణ ప్రాకారంలోనే ఈ సేవలు నిర్వహించబడుతున్నాయి. ఇకపై అన్ని సేవలు మాడవీధుల గుండానే నిర్వహించ బడుతాయి. ఈ దశలో భాగంగానే వాహన సేవలు జరుపడానికి అలాగే రథోత్సవం జరుపడానికి పెద్ద రథం కంచి కామాక్షమ్మ రథాన్ని పోలిన రథాన్ని జగము శాస్త్రం ప్రకారం రథం చేయడానికి చర్చించగా దాదాపు కోటి రూపాయలు ఈ రథానికి ఖర్చవుతుందని శ్రీవర్ధితాదారు మయమైన (టేకు చెక్కతో) రథం తయారు చేయించడానికి ధర్మకర్తల మండలి సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్మాణానికి కావలసిన ప్రభుత్వ అనుమతులు ఆలయ కార్యనిర్వాహక వర్గానికి జారీ చేయించడానికి తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ ను, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని ధర్మకర్తల మండలి కోరింది. ప్రతి నిత్యం పూజాకాల సమయం నందు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మహాపూజానంతరం ఉచిత ప్రసాద వితరణ జరుపడానికి ధర్మకర్తల మండలి తీర్మానించింది. అమ్మవారి ప్రసాద వితరణ కోసం ఒక శాశ్వత నిధిని బ్యాంకులో ఏర్పాటు చేయడానికి ఉదారముగా విరాళాలు అందించవలసిందిగా ధర్మకర్తల మండలి భక్తులను కోరారు. అంతేకాకుండా 26062025 నుండి 10072025 వరకు శాకంభరీ నవరాత్ర మహోత్సవములు అత్యంత వైభవోపేతంగా నిర్వహించుటకు ఏర్పాట్ల గూర్చి చర్చించారు. ఈ సమావేశంలో ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరిరామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగు అంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ రావు, ఎక్స్ ఆఫీషియో మెంబర్గా పార్నంది నర్సింహమూర్తి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, సిబ్బంది, పాల్గొన్నారు.



# మంత్రి తుమ్మలను కలిసిన అల్లూరి శ్రీనాథ్ రెడ్డి

**కరీంనగర్ మహా:** వ్యవసాయ శాఖ మంత్రి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి పర్యటనలో భాగంగా తుమ్మల నాగేశ్వర్ రావు, బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని మానకొండూరు నియోజవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు.

# వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

## తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిపై చీటింగ్ కేసు

### రూ.10 లక్షలు తీసుకున్న రంగినేని శ్రీనివాస్ రావు



**ఆదిలాబాద్, మహా :** వైద్య శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10 లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కు చెందిన తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ రావ్ అనే వ్యక్తి ఆశగిరి హనుమాన్లు కుమారుడికి వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని 3 సంవత్సరాల క్రితం రూ.10 లక్షలు తీసుకొని మొహం చాటేసాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితులు ఈనెల 8న వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

# ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం



**రాజేంద్రనగర్ మహా;** రాజేంద్రనగర్ డివిజన్ పరిధి శాస్త్రిపూరంలోని ఫర్నిచర్ గోదాంలో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి ఘటన ఆదివారం మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.శాస్త్రి పురంలోని హెచ్ కే జి ఎన్ ఫర్నిచర్ గోదాంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన కార్మికులు బయటికి పరుగులు తీశారు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో రంగం లోకి దిగిన ఫైర్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను పూర్తిగా అదుపుచేశారు.

# మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ పట్టణంలో విలేకరుల సమావేశం అసెంబ్లీ కన్వీనర్ టంగుటూరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈయొక్క సమావేశానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పర్యావరణ నియోజకవర్గం ఇంచార్జి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబెర్ చెంది మహేందర్ రెడ్డి, ప్రోగ్రామ్ జిల్లా కోకన్వీనర్ కక్కునూరి వెంకటేష్ గుప్త పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర పార్టీ, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు రేపు భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ప్రతి పోలింగ్ బూత్ లో 100 మొక్కలు నాటే కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా రేపు జన సంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్ లలో ఆ మహనీయుని చిత్ర పటానికి పూలమాల తో శ్రద్ధాంజలి ఘటించాలని కోరారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మకు వందనం కార్యక్రమం లో భాగంగా ప్రతి పోలింగ్ బూత్ లో వంద మొక్కలు నాటాలని కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చేగు సుధాకర్, శ్యామ్ సుందర్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబం వైద్య ఖర్చులకు ఐదు లక్షల ఎల్ఓసి



- అందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- గతంలో ఆరిఫ్ కుటుంబానికి ఐదు లక్షల ఎల్ఓసి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అంతారం గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన ఎండి అరీఫ్ కూతురి గుండె శస్త్ర చికిత్స కోసం ఐదు లక్షల ఎల్ఓసిని, స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, రోగి కుటుంబ సభ్యులకు అందజేశారు. రంగారెడ్డి జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం, తలకొండపల్లి మండలం, అంతారం గ్రామానికి చెందిన ఎండి అరీఫ్ కూతురు సమ్రీన్ బేగం గుండె శస్త్ర చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రిలో 20 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలపడంతో, మండల నాయకులతో కలిసి కల్వకుర్తి శాసనసభ్యులు కసి రెడ్డి నారాయణ రెడ్డిని కలవడంతో వారి సహకారంతో గతంలోనూ ఐదు లక్షలు మంజూరు కావడం జరిగింది. ఆదివారం ఐదు లక్షలు మంజూరు చేయించిన స్థానిక శాసనసభ్యులు, తలకొండపల్లి మండల నాయకులతో కలిసి, ఎండి అరీఫ్ కు అందించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న ప్రపంచంలో ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ చూపాలని ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సూచనలు పాటిస్తూ, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కలుషిత ఆహారాన్ని తీసుకోకుండా జాగ్రత్తలు వహించాలని ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా మంచిదని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకట్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ అంజయ్య గౌడ్, వేదాద్రి లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ధర్మకర్త జి శ్రీనివాస్ మూర్తి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, వెల్జల్ మాజి ఉపసర్పంచ్ అజీజ్, ఎం.డి.జాని తదితరులు పాల్గొన్నారు.

# మారని ప్రైవేట్ స్కూల్స్... ఆగని బుక్స్ దందాలు

## ఆదివారం కూడా బుక్స్ విక్రయం...

### ఎంఈఓ మండల విద్యాధికారి నిర్లక్ష్యంపై ఎస్ ఎఫ్ ఐ ఆగ్రహం

### పాఠశాల వద్దకు చేరుకున్న ఎస్ఎఫ్ఐ నేతలు




**షాద్ నగర్, మహా:** ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. షాద్‌నగర్‌లోని ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో ఆదివారం కూడా తల్లిదండ్రులను ఫోన్ చేసి పిలిపించి మరీ పుస్తకాలు అమ్ముతున్న వైనం బయటపడింది. దీనిపై విద్యార్థి సంఘం ఎస్ ఎఫ్ ఐ నేతలు పాఠశాల వద్దకు చేరుకొని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అయినప్పటికీ, ఎటువంటి అనుమతులు లేకుండా ఢిల్లీ వరల్డ్ స్కూల్‌కు చెందిన టీచర్లు కుర్చీలు వేసుకుని మరీ పాఠ్యపుస్తకాలను అమ్ముతున్నారని వారు మండిపడ్డారు . స్కూల్ మేనేజ్‌మెంట్ కూడా దీనికి సహకరిస్తూ, తల్లిదండ్రులకు ఫోన్ చేసి తమకు నచ్చిన ధరలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్ముతున్నారని ఎస్ ఎఫ్ ఐ నాయకులు ఆరోపించారు. నోట్‌బుక్స్ కొంటేనే టెక్స్ట్‌బుక్స్ ఇస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులను భయపెడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ ఎఫ్ ఐ షాద్‌నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఢిల్లీ వరల్డ్ స్కూల్‌కు వెళ్లి అధిక ఫీజులతో బుక్స్ ఎందుకు అమ్ముతున్నారని, మీకు ఎవరు పర్మిషన్ ఇచ్చారని స్కూల్ సిబ్బందిని నిలదీశారు. దీంతో స్కూల్ సిబ్బంది ఎస్ ఎఫ్ ఐ నాయకులతో వాగ్వాదానికి దిగినట్లు వారు మీడియాకు తెలిపారు. ఇంత జరుగుతున్నా ఫరూక్‌నగర్ మండల విద్యాధికారి ఎం చేస్తున్నారు? ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని ఎస్ ఎఫ్ ఐ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఎంఈఓ ప్రైవేట్ స్కూల్స్‌ను సందర్శించి, ఎక్కడెక్కడైతే బుక్స్ అమ్ముతున్నారో అలాంటి స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ ఎఫ్ ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ నాయకులు అదిల్, రఘు, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్య మీది... పరిష్కార మార్గం నాది...

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- 7వవార్డులోని పలు కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన..
- తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నపం చేసుకున్న మహిళలు...
- వార్డులో అంగన్వాడి, రేషన్ దుకాణం ఏర్పాటుకు హామీ



**షాద్ నగర్, మహా:** సమస్య మీది పరిష్కార మార్గం నాది అనే దిశగా ఎమ్మెల్యే శంకర్ ప్రజల్లో ఒక్కడిగా మమేకమై వారి సమస్యలను అడిగి మరి తెలుసుకుంటున్నారు. వారికి పరిష్కార మార్గం చూపెడుతూ ఆదివారం షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులోని పలు కాలనీలో ఎమ్మెల్యే ప్రజల ఇంటి వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో ఆదివారం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ వార్డు ఇంచార్జి, కాంటెస్ట్ కౌన్సిలర్ కొప్పునూరు ప్రవీణ్ కుమార్, కాలనీ పెద్దల అభీష్టం మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈశ్వర్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ తదితర కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు, మహిళలు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలు, తమ అవసరాలను ఎమ్మెల్యేకు వివరించారు. వార్డు ప్రజలు ప్రధానంగా అంగన్వాడి కేంద్రం, రేషన్ దుకాణం ఏర్పాటు చేసేలా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అంగన్వాడి కేంద్రం, నూతన రేషన్ దుకాణ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా చాలామందికి రేషన్ కార్డులు లేవని ఎమ్మెల్యే దృష్టికి తెవడంతో వెంటనే ఎమ్మార్వో తో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. మరో మహిళ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను అడగడంతో వెంటనే సంబంధిత అధికారులకు తెలిపారు. ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పలువురు మహిళలు, కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అదే వార్డులో ఉన్న సీనియర్ జర్నలిస్టు మోహన్ రెడ్డి పిలుపుమేరకు వారి ఇంటికి తేనేటి విందుకు వెళ్లి ఆదర్శ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు అగనూరు విశ్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, బస్వం, ఎండి ఇబ్రహీం, చెన్నయ్య, యువ నాయకుడు అందే మోహన్, మంచిరేవుల అశోక్, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, డిసిపి షేక్ సలీమా దిశా నిర్దేశంలో వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ ఆధ్వర్యంలో మట్టెవాడ పోలీసులు యాంటీ డ్రగ్ వారోత్సవాల్లో భాగంగా రంగంపేట లోని వివిధ హాస్టల్లు, మాదక ద్రవ్యాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం తో పాటు వరంగల్ ఎంజీఎం లోని రోగులకు, వారి బంధువులకు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన యువ ఎస్సైలు శ్రీనివాస్, శివకృష్ణ ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి యువతను చైతన్య పరుస్తూ యువత డ్రగ్స్ బారిన పడకుండా, డ్రగ్స్ మత్తులో జీవితాలను నాశనం చేసుకోకుండా ఉండడం కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరంగా చెప్పారు. అదేవిధంగా డిప్రెషన్ లో గాని అధైర్యం, భయంతో గాని ఎవరు కూడా డ్రగ్స్ కు బానిస కాకూడదని వీటి వల్లే అనేక నేరాలకు పాల్పడడం జరుగుతుందని వివరించారు. డ్రగ్స్ వల్ల మనుషులు మానసిక పరిస్థితి ఆందోళనకారంగా మారి సైకోలుగా మారడానికి డ్రగ్స్ కారణమని ఆ డ్రగ్స్ దొరకని పరిస్థితి ఉంటే వారు విల విల లాడిపోతారని ముందు కిక్కు కోసం ప్రారంభించిన డ్రగ్ అది లేకపోతే మనిషి పిచ్చివాడిలా మారి 20 ఏళ్ల వాళ్ళు 60 ఏళ్లుగా మారిపోవడం శరీరం మొత్తం నిర్వీర్యం అయిపోవడం నరాల బలహీన పడిపోవడం ఖాయం అని అందుచేత ముందే సర్వరోగాలు తెచ్చుకోవడం కంటే డ్రగ్స్ కు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన భారత్ కోసం పోరాడాలని యువతకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఇలా ఎవరైన డ్రగ్స్ అమ్ముతున్న, డ్రగ్స్ బారిన పడుతున్నా, డ్రగ్స్ సప్లై చేస్తున్నా, వారి సమాచారం వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.

# సింగరేణి తొలి పంప్డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్

## రామగుండంలో ఏర్పాటు చేస్తున్న సంస్థ

వ్యాపార విస్తరణలో భాగంగా పెద్ద ఎత్తున విద్యుత్తు ప్లాంట్లను నెలకొల్పుతున్న సింగరేణి సంస్థ తాజాగా రాష్ట్రంలోనే తొలి పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. రామగుండం 1 ఏరియాలోని మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో తొలి పంప్డ్ స్టోరేజీ ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ శనివారం ప్రకటించారు. ఇప్పటికే ప్రాథమిక అధ్యయనం పూరత్యుందని, డీపీఆర్ రూపొందించే బాధ్యతలను వ్యాప్కోస్ లిమిటెడ్ సంస్థకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.


జియోలాజికల్, జియో టెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలు, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ డిజైన్లు, పర్యావరణ సంబంధ అంశాలు రక్షణ చర్యలపై అధ్యయనం జరిపి డీపీఆర్‌ను రూపొందిస్తామన్నారు. మేడిపల్లి ఓపెన్‌కాస్టు మూసివేయగా, ఈ ప్లాంట్ ఏర్పాటుతో తిరిగి వినియోగంలోకి తీసుకురాన్నట్లు సీఎండీ వెల్లడించారు. రూ.3 వేల కోట్లతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుండగా, 40 ఏండ్ల పాటు 500 మెగావాట్ల విద్యుత్తును ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి చేస్తామన్నారు.

**ఉత్పత్తి ఇలా..**

పంప్డ్ స్టోరేజీ అనేది ఒక రకంగా జల విద్యుత్తు ప్లాంటే. అయితే జల విద్యుత్తు కేంద్రాల్లో నీటి ప్రవాహం సహజంగా ఉంటుంది. కానీ పంప్డ్ స్టోరేజీని నీటిని కింది నుంచి పైకి పంపింగ్ చేసి, కిందికి వదిలి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. అంటే సంపులో నీటిని నిల్వచేయడం, పైకి పంపింగ్ చేయడం, తిరిగి కిందికి వదలడంతో దానిద్వారా విద్యుత్తు ఉత్పత్తి కానున్నది. ప్రతిపాదిత మేడిపల్లి ఓసీని నీటి సంపుగా మార్చి, 157 మీటర్ల లోపులో నీటిని నిల్వచేస్తారు. ఈ నీటిని తోడి ఎత్తైన ప్రదేశానికి పంపింగ్ చేస్తారు. పై భాగంలో టర్బైన్లు, జనరేటర్లతో కూడిన విద్యుత్తు తయారీ ప్లాంట్‌ను నెలకొల్పుతారు. పైకి పంపింగ్ చేసిన నీటిని అక్కడి నుంచి తిరిగి కిందికి వదులుతారు. ఈ నీటి ద్వారా టర్బైన్లను తిప్పి విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు.

# హార్మోజ్ జలసంధి మూసివేత

## అమెరికా వెన్నులో వణుకు చైనాకు ఫోన్.. ప్రపంచానికి షాక్




**మహా:** ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం పతాక స్థాయికి చేరింది. మరోవైపు అమెరికా సైతం ఇరాన్ పై దాడులు చేస్తోంది. ఈ క్రమంలో ప్రపంచ దేశాలకు బిగ్ షాక్ ఇచ్చేందుకు ఇరాన్ సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రపంచంలోనే చమురు వాణిజ్యానికి కీలకమైన హార్మోజ్ జలసంధిని మూసివేసేందుకు సిద్ధం అవుతోంది. ఏ క్షణమైనా ఇరాన్ ఈ సంచలన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో ప్రపంచ దేశాలు వణికిపోతున్నాయి. ఈ క్రమంలోనే మరికొన్ని గంటల్లో హార్మోజ్ జల సంధిని మూసివేస్తాం అని ఇరాన్ ఐఆర్జీసీ నేవీ కమాండర్ అలీరెజా వెల్లడించారు. అయితే ఇరాన్ హార్మోజ్ జల సంధిని మూసేయడంపై అమెరికా స్పందించింది. ఇదో ఎకనామిక్ సూసైడ్ అని అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో అభివర్ణించారు. ఈ మేరకు హార్మోజ్ జల సంధి నిలిపివేతను ఉపసంహరించుకునేలా ఇరాన్‌కు వివరించాలని చైనాను కోరింది అమెరికా. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థపై ఇదో పిడుగు లాంటిదని మార్కో రూబియో పేర్కొన్నారు. ఈ మేరకు చైనా జోక్యం చేసుకుని ఇరాన్ కు నచ్చజెప్పాలన్నారు.

**ప్రపంచ దేశాలకు 20శాతం.. భారత్ కు 40 శాతం**

"ఇరాన్ హార్మోజ్ జల సంధిని మూసివేస్తే మరో అతిపెద్ద తప్పు చేసినట్లుగా భావించాలి. ఇరాన్ కు ఎకానమిక్ సూసైడ్ ఇది. అంతేకాక ప్రపంచ దేశాలు ఆర్థికంగా దెబ్బతింటాయి" అని మార్కో రూబియో పేర్కొన్నారు. మరోవైపు అమెరికా జూన్ 21 న ఇరాన్ పై జరిపిన దాడుల్లో ఇరాన్ లోని ఫోర్డో, ఇస్ఫాహన్, నటాంజ్ అణు స్థావరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా రోజువారీ ముడి చమురు, గ్యాస్ అవసరాల్లో ప్రపంచ దేశాలకు 20శాతం.. భారత్ కు వచ్చే చమురు, గ్యాస్ లో 40 శాతం హార్మోజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. ఇరాన్ తాజాగా తీసుకోబోతున్న నిర్ణయంతో క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 120 నుంచి 150 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇరాన్ నిర్ణయంతో పెట్రోల్, డీజిల్ ధరలపై అధిక ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**హార్మోజ్ జల సంధి ఎక్కడుంది..?**


ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు, గ్యాస్ రవాణాలో హార్మోజ్ జల సంధి చాలా కీలకమైనది. ఈ జల సంధి ఇరాన్.. గల్ఫ్ దేశాల మధ్యలో ఉంటుంది. ఈ మార్గం గుండా రోజూ సౌదీ అరేబియా, ఇరాక్, ఖతార్, యూఏఈ, ఇరాన్ కు చెందిన చమురు ఓడలు ప్రయాణం సాగిస్తాయి. ఇది కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. సముద్రంలోని ఒక్కో మార్గానికి మధ్య కేవలం 3 కిలోమీటర్ల గ్యాప్ మాత్రమే ఉంటుంది.

# ఎల్ఐసీ హెచ్‌ఎఫ్ఎల్ వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ :** దేశంలో అతిపెద్ద హౌజింగ్ ఫైనాన్స్ ఎల్ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ మరోసారి వడ్డీరేట్లను తగ్గించింది. నూతనంగా గృహ రుణాలు తీసుకునేవారికి వడ్డీరేటును అర శాతం కోత పెట్టింది. దీంతో 7.50 శాతం వార్షిక వడ్డీరేటుతో గృహ రుణాలు ప్రారంభంకానున్నాయి. తగ్గించిన వడ్డీరేట్లు ఈ నెల 19 నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. రిజర్వుబ్యాంక్ ఇటీవల కీలక వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో త్రిభువన్ అధికారి తెలిపారు.

# పన్ను వసూళ్లలో క్షీణత

## ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.4.59 లక్షల కోట్లు మాత్రమే




**న్యూఢిల్లీ:** పన్ను వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.4.59 లక్ష కోట్ల నికర ప్రత్యక్ష పన్ను వసూలయ్యాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో వసూలైన రూ.4.65 లక్షల కోట్లతో పోలిస్తే 1.39 శాతం తగ్గాయని పేర్కొంది. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు మందగించడం, అధికంగా రిఫండ్లు చెల్లింపులు జరపడం వల్లనే తగ్గాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 19 మధ్యకాలంలో కార్పొరేట్ల లాభదాయకత, వ్యక్తుల ఆదాయం కేవలం 3.87 శాతం పెరిగి రూ.1.56 లక్షల కోట్లకు చేరకున్నాయి. గతేడాది ఇదే సమయంలో అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27 శాతం అధికమయ్యాయి. అలాగే కార్పొరేట్ల అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 5.86 శాతం అధికమై రూ.1.22 లక్షల కోట్లకు చేరుకోగా..కార్పొరేటేతర్లు, వ్యక్తిగత, హెచ్‌యూఎఫ్, సంస్థల ట్యాక్స్ వసూళ్లు 2.68 శాతం తగ్గి రూ.33,928 కోట్లకు పరిమితమయ్యాయి.

- రిఫండ్ చెల్లింపులు ఏడాది ప్రాతిపదికన 58 శాతం ఎగబాకి రూ.86,385 కోట్లకు చేరుకున్నాయి.
- స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5.45 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాదితో పోలిస్తే 4.86 శాతం అధికమయ్యాయి.
- ఏప్రిల్ 1 నుంచి జూన్ 19 వరకు నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 5 శాతం తగ్గి రూ.1.73 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి.

# భారత్‌లో తొలి టెస్లా షోరూం..

## జూలై నుంచి మోడల్ వై ఈవీల అమ్మకాలు..!



ఎలక్ట్రానిక్ కార్ల తయారీలో దిగ్గజంగా పేరొందిన టెస్లా (Telsa) కంపెనీ భారత్‌లో అడుగుపెట్టనుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూం ప్రారంభించేందుకు టెస్లా యాజమాన్యం సిద్ధమవుతోంది. జూన్‌లో ముంబై కేంద్రంగా 'మోడల్ వై రేర్ వీల్ డ్రైవ్ ఎస్‌యూవీ' కార్లను అమ్మేందుకు సన్నాహకాలు చేస్తోంది. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ షో రూం ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని న్యూయార్క్‌లోని బ్లూమ్‌బర్గ (Bloomberg) వార్తా కథనం పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోడీ (Narendra Modi) ఫిబ్రవరిలో అమెరికా పర్యటన సమయంలోనే భారత్‌లో టెస్లా విస్తరణకు బీజం పడిందని సదరు మీడియా సంస్థ తెలిపింది. ఆటోమొబైల్ రంగంలో కొత్త ఒరవడి సృష్టించిన టెస్లా కంపెనీ ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌కు ఈసారి భారత్‌ను ఎంచుకుంది. యూరప్, చైనాలో అమ్మకాలు పడిపోవడంతో ఇండియాలో సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో ఉంది ఎలాన్ మస్క్ చెందిన ఈ సంస్థ. అందులో భాగంగానే ముంబైలో తమ తొలి షోరూం ప్రారంభించడానికి టెస్లా ఏర్పాట్లు చకచకా చేస్తోంది. వచ్చే నెలలో అమ్మకాలకు సర్వం సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే చైనా, అమెరికాల నుంచి సూపర్ చార్జర్లు, కార్ యాక్సెసరీస్, ఇతర విడిభాగాలను పెద్ద సంఖ్యలో దిగుమతి చేసుకుందని బ్లూమ్‌బర్గ్ తమ కథనంలో వెల్లడించింది. అంతేకాదు మోడల్ వై రీర్ వీల్ డ్రైవ్ ఎస్‌యూవీలను చైనాలోని షాంఘైలో ఉన్న తమ ఫ్యాక్టరీ నుంచి భారత్‌కు తీసుకువచ్చింది టెస్లా. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# సిఫారసు ఉంటేనే పరిశ్రమకు సై

## నిలిచిపోయిన దరఖాస్తుల పరిశీలన

- కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన వైనం
- పడకేసిన టీజీఐఐసీ..అయోమయ స్థితిలో పారిశ్రామికవేత్తలు
- బీఆర్ఎస్ హయాంలో 25 వేల వరకు అనుమతుల మంజూరు
- గతంలో సజావుగా సాగిన ఆన్‌లైన్, సింగిల్ విండో విధానం



రాష్ట్రంలో పారిశ్రామిక రంగం కునారిల్లుతున్నది. పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులు నుంచి వస్తున్న దరఖాస్తులకు దిక్కూ మొక్కూ లేకుండా పోయింది. అనేక నెలలుగా దరఖాస్తులను పరిశీలించే నాథుడే లేకపోవడంతో అవి కుప్పలుతెప్పలుగా పేరుకుపోయాయి. రాష్ట్రంలో ఏదైనా పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే ముందుగా అనుమతుల కోసం టీజీఐఐసీకి దరఖాస్తు చేసుకోవాలి. ఆ పత్రాలన్నీ సవ్యంగా ఉంటే అనుమతులు మంజూరు చేసి, దరఖాస్తుదారులు కోరుకున్న పారిశ్రామికవాడలో నిర్ణీత ధరకు భూమిని కేటాయిస్తారు. ఇదే క్రమంలో ఎంతో మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ కరుణించేవాడు లేకుండా పోయింది కాంగ్రెస్ సర్కార్ పరిపాలనలో. ఉదాహరణకు నల్గొండకు చెందిన ఓ ఔత్సాహిక పారిశ్రామిక వేత్త దండు మల్కాపూర్‌లో ఎంఎస్ఎంఈ యూనిట్ ఏర్పాటుకు గతేడాది ఫిబ్రవరిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఇంతవరకు అతని దరఖాస్తు పరిశీలించిన పాపనపోలేదు. అదే ప్రాంతంలో యూనిట్ ఏర్పాటునకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకున్న వేరొకరికి మాత్రం వెంటనే అనుమతులు మంజూరయ్యాయి. కరీంనగర్ జిల్లాలో పరిశ్రమ ఏర్పాటుకు గత ఏడాది ఆగస్టులో దరఖాస్తు చేసుకున్న ఓ వ్యక్తికి ఇంతవరకు అనుమతులు మంజూరు కాలేదు. దరఖాస్తులో కానీ, అర్హతల్లో కానీ ఎటువంటి లోపాలు లేవు. అయినా ఆయన దరఖాస్తును పరిశీలించిన నాథుడే లేడు. ఇవి మచ్చుకకి ఒకటి రెండు మాత్రమే. టీజీఐఐసీలో ఇటువంటివి తవ్వుతున్నా కొద్ది బయట పడుతున్నాయి. అనుమతుల కోసం దరఖాస్తు చేసేవారు మంత్రిదో, లేక స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధిదో సిఫారసు తీసుకొని వెళ్తే తప్పా అనుమతులు మంజూరయ్యే పరిస్థితి లేదు. పరిశ్రమకు అనుమతి కోరుతూ ఆన్‌లైన్ ద్వారా నిత్యం పదుల సంఖ్యలో టీజీఐఐసీకి దరఖాస్తులు వస్తాయి. వాటిని ప్రతివారం అధికారులు పరిశీలించి అందులో అన్నీ సవ్యంగా ఉన్నవాటికి అనుమతులు మంజూరు చేస్తారు. గతంలో ప్రతివారం 50 నుంచి 60 వరకు అనుమతులు మంజూరయ్యేవి. టీఎస్ఐపాస్ చట్టం ద్వారా 2015 నుంచి 2023 వరకు సుమారు 24,241 అనుమతులు మంజూరుచేశారు. ఇందులో తయారీ రంగంలో 21,921 యూనిట్లు కాగా, మిగిలినవి సేవల రంగానికి సంబంధించినవి. దరఖాస్తు చేసుకున్నవారికి టీజీఐఐసీ అధికారులు మెసేజ్ ద్వారా వెంటనే దరఖాస్తు పురోగతి వివరాలు, ఇంటర్వ్యూల వివరాలు అందించేవారు. అనుమతులు సైతం ఆన్‌లైన్ ద్వారా పొందే వెసులుబాటు కల్పించారు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులను పరిశీలించే నాథుడే కరువయ్యాడు. టీజీఐఐసీ అధికారులు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల సిఫారసులు ఉన్నవాటిని మాత్రమే ప్రాసెస్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం 2 వేలకు పైగా దరఖాస్తులు పేరుకుపోయినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిన్నరలో మంజూరైన అనుమతులు కేవలం 190 మాత్రమే కావడం గమనార్హం. దీన్నిబట్టి పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చు.

**చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ నేతలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కొందరికి అనుమతులు మంజూరు చేసినప్పటికీ స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అభ్యంతరం చెప్పడంతో వాటిని నిలిపివేశారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఉదాహరణకు కీసర ప్రాంతంలోని ఓ పారిశ్రామికవాడలో ఒకరికి పరిశ్రమ ఏర్పాటుకు అనుమతించి భూమి కేటాయించగా, సదరు వ్యక్తి భూమి చదును చేసుకునేందుకు వెళ్లగా స్థానికంగా ఉండే ఓ కాంగ్రెస్ నేత పనులు నిలిపివేసినట్లు తెలిపారు. సంగారెడ్డి, నల్గొండ, కరీంనగర్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, యాదాద్రిభువనగిరి తదితర జిల్లాల్లో మంత్రులు, స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల అనుమతి లేకుండా ఒక్క అనుమతి కూడా మంజూరు కావడంలేదని చెబుతున్నారు. ముఖ్యంగా బండ తిమ్మాపూర్, బండ మైలారం, పాశమైలారం, సుల్తాన్‌పూర్, ఇబ్రహీంపట్నం, భువనగిరి తదితర ప్రాంతాల్లోని ఇండస్ట్రియల్ పార్కుల్లో అనుమతులకు డిమాండ్ అధికంగా ఉందని, అయినా రాజకీయ జోక్యం కారణంగా తాము అర్హతలకు అనుగుణంగా అనుమతులు మంజూరుచేసే అవకాశం లేదని అధికారవర్గాలు వాపోతున్నాయి. అందుకే మంత్రులు, ఎమ్మెల్యేలనుంచి ఫోన్లు చేయించుకున్న వారికి మాత్రమే అనుమతులు ఇస్తున్నట్లు ఓ అధికారి వ్యాఖ్యానించారు.

**ఫ్యూచర్ సిటీవైపు..**

గత బీఆర్ఎస్ సర్కారు పరిశ్రమల కోసం ప్రభుత్వ భూములు సహా దాదాపు 1.50 లక్షల ఎకరాల ల్యాండ్‌బ్యాంక్‌ను సిద్ధం చేసింది. అంతేకాదు, దాదాపు 156 వరకు ఇండస్ట్రియల్ పార్క్‌లను ఏర్పాటుచేసి దాదాపు 28 వేల ఎకరాలకు పైగా భూములను పరిశ్రమలకోసం కేటాయించింది. ఇంకా చాలా పార్క్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలకు కేటాయించాల్సి ఉంది. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆ భూములను అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయించాల్సింది పోయి ఫ్యూచర్ సిటీ వెంట పరుగులు తీస్తున్నది. దరఖాస్తులు కుప్పతెప్పలుగా పేరుకుపోయినా పట్టించుకోకుండా నగరానికి ఆమడ దూరంలో కొత్త నగరాన్ని అభివృద్ధిచేసి అక్కడే పరిశ్రమలకు భూములిస్తామని చెబుతున్నది. ఫ్యూచర్ సిటీ ఎప్పటికి పూర్తవుతుందో, పరిశ్రమలకు ఎప్పటికి అనుమతులు వస్తాయో అర్థం కావడంలేదని పరిశ్రమవర్గాలు తలలు పట్టుకుంటున్నాయి.

**కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పరిస్థితి..**

అనుమతించిన పరిశ్రమలు 190 పెండింగులో ఉన్న దరఖాస్తులు 2,000 చెప్పుకోదగ్గ పరిశ్రమలు వచ్చిన దాఖలాలు లేవు వెనక్కిపోయిన భారీ పరిశ్రమలు... కార్నింగ్ గొరిల్లా గ్లాస్ తయారీ ప్లాంట్, కేన్స్ సెమీకండక్టర్ల పరిశ్రమ గతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీ రద్దు అమలుకు నోచుకోని 10 ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ తెచ్చినా విడుదలకాని మార్గదర్శకాలు కొత్త పారిశ్రామిక, ఐటీ పాలసీ పేరుతో కాలయాపన గణనీయంగా తగ్గిన కొత్త పరిశ్రమల నమోదు.

# ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్..

## 125 యుద్ధవిమానాలతో మెరుపుదాడి చేశామిలా..!



పశ్చిమాసియాలోని ఇరాన్‌ను హెచ్చరిస్తూ వచ్చిన అమెరికా యుద్ధరంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఇజ్రాయేల్‌కు మద్దతుగా నిలుస్తూ.. ఇరాన్‌పై శనివారం అమెరికా సైన్యం బాంబుల వర్షం కురిపించింది. 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' కోడ్ పేరుతో జరిగిన ఈ దాడులతో ఇరాన్ ఉలిక్కిపడింది. ఈ కోడ్ ఆపరేషన్ వివరాలను జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టేట్ జనరల్ చైర్మన్ డాన్ కైన్ ఆదివారం శ్వేత సౌధంలో వెల్లడించారు. ఇరాన్‌పై 125 యుద్ధ విమానాలతో 25 నిమిషాల్లో మెరుపుదాడి చేశామని ఆయన చెప్పారు. ఈ ఆపరేషన్ ఇరాన్‌లోని అణు కేంద్రాలే లక్ష్యంగా సాగినట్టు కైన్ తెలిపారు. 'శుక్రవారం అర్ధ రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ ఇరాన్‌పై దాడులు చేశాం. 125 యుద్ధ విమానాలతో 25 నిమిషాల పాటు మెరుపు దాడి కొనసాగించాం. అణు స్థావరాలైన ఫోర్డో, నతంజులపై 13 వేల కిలోలకు పైగా భారీగా పేలుడు పదార్థాలతో విరుచుకుపడ్డాం. ఇసాఫహన్ అణు కేంద్రంపై తొమహక్ క్షిపణులను ప్రయోగించాం. వీటిలో ఏడు బీ2 స్పిరిట్ బాంబర్‌ది కీలక పాత్ర. ఇరాన్‌లోని బంకర్లను ధ్వంసం చేయడం కోసం 14 బంకర్ బస్టర్ బాంబ్స్ ఉపయోగించాం. యుద్ధ వ్యూహంలో భాగంగా ఇరాన్ సైన్యం దృష్టి మరల్చడం కోసం కొన్ని విమానాలను పశ్చిమ ప్రాంతం, పసిఫిక్ మహాసముద్రం మీదుగా నడిపాం' అని కైన్ వివరించారు. అమెరికా ఎంట్రీతో ఇజ్రాయేల్ బలం పెరగినా.. ఇరాన్ మాత్రం తగ్గేదేలే అంటోంది. అమెరికా మొదలు పెట్టింది.. మేము ముగిస్తాం అంటూ ఆ దేశ నాయకులు అంటున్నారు.

# ప్రధాని మోదీకి ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఫోన్

ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ భారత ప్రధాని నరేంద్రమోదీకి ఫోన్ చేశారు. ఇరాన్‌లోని అణు స్థావరాలపై అమెరికా దాడులకు పాల్పడిన నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడి నుంచి భారత ప్రధానికి ఫోన్ వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు ఇద్దరి మధ్య ఫోన్ సంభాషణ కొనసాగింది. ఇరాన్‌లో పరిస్థితి గురించి ఈ సందర్భంగా ప్రధానికి పెజెష్కియాన్ వివరించారు. భారత్‌ను తనకు మంచి మిత్రుడుగా, శాంతిని పెంపొందించే భాగస్వామిగా అభివర్ణించారు. చర్చలు, దౌత్య మార్గం ద్వారా ఇజ్రాయెల్‌ఇరాన్ దేశాలు శాంతిని నెలకొల్పుకోవాలని సూచన చేసినందుకు ప్రధాని మోదీకి పెజెష్కియాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఇరుదేశాల మధ్య శాంతి, స్థిరత్వం నెలకొనడంలో భారత గళం, పాత్ర చాలా కీలకమని పెజెష్కియాన్ అభిప్రాయం వ్యక్తంచేశారు. కాగా ఇజ్రాయెల్‌ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకే పెరుగుతున్నాయి. ఇవాళ ఇజ్రాయెల్ తరఫున అమెరికా కూడా యుద్ధంలోకి దిగడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యింది. అయితే అమెరికా తమపై ప్రత్యక్ష దాడికి దిగడంపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. తమపై దాడులు చేస్తున్న అమెరికా తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించింది.

# యుద్ధాన్ని కోరుకోవడం లేదు.. సవాల్ చేస్తే తగ్గేదెలే..!

## ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్‌పై పెంటగాన్ కీలక ప్రకటన..!

ఇరాన్‌లోని మూడు కీలకమైన అణుకేంద్రాలపై అమెరికా ఆదివారం తెల్లవారు జామున విరుచుకుపడింది. ఈ మిషన్‌కు 'ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్' పేరు పెట్టినట్లుగా పెంటగాన్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో 125పైగా యూఎస్ యుద్ధ విమానాలు, మిస్సైల్స్ పాల్గొన్నాయని చెప్పింది. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కేన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఇరాన్‌లోని ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. సాధారణ పౌరులకు హాని జరుగకుండా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు. బాంబర్లు, ఫైటర్ జెట్లు, ట్యాంకర్లు, నిఘా విమానాలు సహా 125పైకిగా అమెరికన్ విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయని చెప్పారు. పశ్చిమాసియాలో భద్రత, శాంతిని కొనసాగించేందుకు ఈ చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని రక్షణ మంత్రి పీట్ హేగ్సేత్ పేర్కొన్నారు. ఇరాన్ శాంతి మార్గాన్ని అవలంబించకపోతే, అమెరికా మరింత కఠినమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడదని హెచ్చరించారు. ఇరానియన్ సైనికులు, ఇరానియన్ ప్రజలను లక్ష్యంగా దాడులు చేయలేదని స్పష్టం చేశారు. రాత్రి అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ అర్ధరాత్రి మూడు ఇరానియన్ అణు స్థావరాలు, ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై ఖచ్చితమైన దాడి చేసిందని.. ఇది అద్భుతమైన విజయమన్నారు. మా కమాండర్ ఇన్ చీఫ్ నుంచి అందిన ఆదేశాల మేరకు అణుకేంద్రాలను నాశనం చేసినట్లు తెలిపారు. ప్రెసిడెంట్ ట్రంప్ ప్రణాళిక ధైర్యంగా, అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. అధ్యక్షుడు శాంతి గురించి మాట్లాడితే చర్చల కోసం 60 రోజులు సమయం ఇస్తారని.. కానీ, ఆ తర్వాత ఇరాన్ అణుకార్యక్రమం మనుగడ సాగించదని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ తయారీలో ఇజ్రాయెల్ సైతం కీలకపాత్ర పోషించిందని పీట్ హెగ్సేత్ తెలిపారు. చరిత్రలో తొలిసారిగా ఈ ఆపరేషన్‌లో ఎంవోపీ వంటి భారీ బాంబులను ఉపయోగించినట్లు తెలిపారు. ఈ బాంబులు 30వేల బరువు ఉంటాయని.. వాటికి భూగర్భ బంకర్లను నాశనం చేయగలవన్నారు. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కేన్ మాట్లాడుతూ.. ఈ దాడి యూఎస్ సెంట్రల్ కమాండ్ జనరల్ ఎరిక్ కురిల్లా నాయకత్వంలో జరిగిందని తెలిపారు.

మహా పత్రిక
సినిమా వార్తలు | MOVIE NEWS
సోమవారం, హైదరాబాద్ | 23-06-2025
ANN తెలుగు



# స్నానం చేసిన నీటితో సబ్బులు తయారు చేయించిన హీరోయిన్..

సినీ సెలబ్రెటీలకు ఏ రేంజ్ లో ఫ్యాన్స్ ఉంటారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమ అభిమాన నటుల కోసం ఫ్యాన్స్ చాలా చేస్తుంటారు. అలాగే కొన్నిసార్లు ఫ్యాన్స్ కోసం సెలబ్రెటీలు కూడా చిత్ర విచిత్రమైనవి చేస్తుంటారు. కొంతమంది సెలబ్రెటీలు చేసే పనిలో అభిమానులను అవాక్ అయ్యేలా చేస్తుంటాయి. తాజాగా ఓ హీరోయిన్ ఏకంగా తనను స్నానం చేసిన నీటితో ఏకంగా సబ్బునే తాయారు చేసి దాన్ని అమ్మకానికి ఉంచింది. అంతే కాదు లిమిటెడ్ ఎడిషన్ అంటూ ఆఫర్ కూడా ఇచ్చింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఆ ముద్దుగుమ్మ అందానికి ఫిదా కానీ కుర్రకారు ఉండరు. ఇంతకూ ఆ హాట్ బ్యూటీ ఎవరో తెలుసా.?

సిడ్నీ స్వీనీ.. ఈ చిన్నది ఓ హాలీవుడ్ నటి. ఈ ముద్దుగుమ్మ చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. తాజాగా ఈ హాట్ బ్యూటీ తన ఫ్యాన్స్ కోసం స్నానం చేసిన నీటిని నిల్వ చేసి మరీ వాటితో సబ్బు తయారు చేయించింది.

ఇటీవల, సిడ్నీ Dr. Squatch అనే సబ్బు బ్రాండ్‌తో కలిసి సిడ్నీస్ బాత్ వాటర్ బ్లిస్ అనే లిమిటెడ్ ఎడిషన్ సబ్బును విడుదల చేసింది. ఇది సిడ్నీ స్వీనీ స్నానం చేసిన నీటితో తయారు చేశారు. ఈ సబ్బును ప్రకటించి సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది ఈ ముద్దుగుమ్మ. ఈ సబ్బు జూన్ 6, 2025 నుండి అందుబాటులో ఉండనుంది.

ఈ సబ్బు ధర 8 డీలర్స్ అలాగే ఇవి కేవలం 5,000లు మాత్రమే తాయారు చేశారు. ప్రతి సోప్ కు ఒక సర్టిఫికేట్ ఆఫ్ ఆథెంటిసిటీ ఉంటుంది. ఇది జూన్ 6, 2025 నుండి డాక్టర్ స్క్వాచ్ వెబ్‌సైట్‌లో 8 డీలర్స్(మన కరన్సీలో రూ. 700)కి అందుబాటులో ఉంటుంది. అలాగే, 100 సబ్బులను గెలుచుకునేందుకు మే 29 నుండి జూన్ 4 వరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక గివ్‌అవే కూడా నిర్వహిస్తున్నారు. ఈ సబ్బులో ఎక్స్‌ఫోలియేటింగ్ ఇసుక, పైన్ బార్క్ ఎక్స్‌ట్రాక్ట్, పైన్, డగ్లస్ ఫిర్, ఎర్తీ మాస్ వంటి సుగంధాలు ఉన్నాయి.



# దళపతి విజయ్ కొత్త మూవీ.. రీమేక్‌పై ఓ క్లారిటీ!

తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ పుట్టినరోజు సందర్భంగా అతడి చివరి సినిమా నుంచి సర్‌ప్రైజ్ వచ్చింది. అర్ధరాత్రి 12 గంటలకు ఫస్ట్ రోర్ పేరిట 'జన నాయగణ్' నుంచి వీడియో రిలీజ్ చేశారు. ఇందులో విజయ్ పోలీస్‌గా కనిపించాడు. ఇప్పుడు ఈ వీడియోకు ఇతడి అభిమానుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఎప్పటిలానే అనిరుధ్ తన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో ఆకట్టుకున్నాడు. బయటకు చెప్పలేదు గానీ 'జన నాయగణ్' సినిమా 'భగవంత్ కేసరి' అనే తెలుగు సినిమాకు రీమేక్. గతంలో పలు అనుమానాలు ఉండేవి. కానీ ఇప్పుడు పోలీస్ గెటప్‌లో ఉన్న వీడియో రిలీజ్ చేయడంతో కొంతవరకు క్లారిటీ వచ్చేసింది. ఇక ట్రైలర్, మిగతా కంటెంట్ వస్తే గనుక రీమేక్ కాదా అనేది కన్ఫర్మ్ అయిపోతుంది. హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్. ఈమె షూటింగ్ రీసెంట్‌గానే పూర్తయింది. మలయాళ బ్యూటీ మమిత బైజు కీలక పాత్రలో నటిస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 9న థియేటర్లలోకి రానుందని అధికారికంగా ప్రకటించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు క్లారిటీ ఇచ్చేశారు. ఇప్పటికే రాజకీయాల్లకి అడుగు పెట్టిన విజయ్‌కి ఇదే చివరి చిత్రం కావడంతో అటు అంచనాలు గట్టిగానే ఉన్నాయి.

# కుబేరలో నాదే మెయిన్ క్యారెక్టర్ అనిపించింది

''మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మ కథ' వంటి సినిమాల్లో హీరో ఎవరని చెప్పలేం. అందులో కథే హీరో... అవన్నీ కూడా డైరెక్టర్ ఫిలిమ్స్. 'కుబేర' కూడా ఔట్ అండ్ ఔట్ శేఖర్ కమ్ములగారి మూవీ ఈ సినిమా కోసం తను ప్రాణం పోశారు. మా సినిమాని ఇంత పెద్ద బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు'' అని అక్కినేని నాగార్జున చెప్పారు. అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ ప్రెస్‌మీట్ లో నాగార్జున మాట్లాడుతూ– ''శేఖర్ చెప్పిన 'కుబేర' కథ వినగానే నాది మెయిన్ క్యారెక్టర్ అనిపించింది. ఎందుకంటే ఈ సినిమాలోని ప్రతి పాత్ర నేను చేసిన దీపక్ క్యారెక్టర్ చుట్టూనే తిరుగుతుంది. నా పాత్రకి వచ్చిన స్పందన గొప్ప ఆనందాన్నిచ్చింది. నా అభిమానులు కూడా చాలా సంతోషంగా ఉన్నారు'' అని చెప్పారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ– ''ఇది సామాన్యమైన సినిమా కాదు. సరస్వతీ దేవి తల ఎత్తుకొని చూసే సినిమా అని ప్రీ రిలీజ్ ఈవెంట్లో చెప్పాను.. అది ఈ రోజు నిజమైంది'' అన్నారు. ''కుబేర' పెద్ద హిట్ అవుతుందని కథ విన్నప్పుడే చెప్పాను'' అని సునీల్ నారంగ్ పేర్కొన్నారు. ''మా సినిమాకి బ్లాక్ బస్టర్ రిపోర్ట్ వచ్చింది. నిర్మాతలుగా చాలా సంతోషంగా ఉన్నాం'' అని పుస్కూర్ రామ్మోహన్ రావు చెప్పారు.



## క్రీడా వార్తలు | SPORTS NEWS



# ఇంగ్లాండ్ @465 ఆలౌట్

- ఓలీ పోప్ 106, హ్యారీ బ్రూక్ 99 పరుగులు
- ఐదు వికెట్లతో సత్తా చాటిన జస్ప్రీత్ బుమ్రా
- అధిక్యంలో టీమిండియా.. తొలి ఇన్నింగ్స్‌నే స్కోరు 471

**స్పోర్ట్స్, మహా:** లీడ్స్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ మూడో రోజు ఆట ఉత్కంఠభరితంగా సాగుతోంది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 471 పరుగులకు సమాధానంగా, ఇంగ్లాండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 465 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత్‌కు కేవలం 6 పరుగుల స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 5 వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. ఆదివారం మూడో రోజు ఆటను 209 పరుగుల వద్ద 3 వికెట్ల నష్టంతో ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు ఆదిలోనే దెబ్బ తగిలింది. శనివారం నాటి స్కోరుకు మరో ఆరు పరుగులు జోడించిన ఓలీ పోప్ (106 పరుగులు, 137 బంతుల్లో 14 ఫోర్లు) ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హ్యారీ బ్రూక్ (99 పరుగులు, 112 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. సెంచరీకి ఒక్క పరుగు దూరంలో ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లోనే బ్రూక్ ఔటయ్యాడు. అంతకుముందు బెన్ డకెట్ (62 పరుగులు) కూడా రాణించాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (20), వికెట్ కీపర్ జేమీ స్మిత్ (40), క్రిస్ వోక్స్ (38) పరుగులు చేసి జట్టు స్కోరును పెంచే ప్రయత్నం చేశారు. చివర్లో బ్రైడన్ కార్స్ (22) కూడా వేగంగా ఆడాడు. దీంతో ఇంగ్లాండ్ 100.4 ఓవర్లలో 465 పరుగులకు తమ తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది.

## బుమ్రా కీలక పాత్ర..

భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా (5/83) తన అద్భుతమైన బౌలింగ్‌తో ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశాడు. అతనికి తోడుగా ప్రసిద్ధ్ కృష్ణ (3/128) మూడు కీలక వికెట్లు తీయగా, మహమ్మద్ సిరాజ్ (2/122) రెండు వికెట్లు దక్కించుకున్నాడు. రవీంద్ర జడేజా వికెట్ తీయకపోయినా పొదుపుగా బౌలింగ్ చేశాడు. అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 113 ఓవర్లలో 471 పరుగులకు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (147), రిషభ్ పంత్ (134), యశస్వి జైస్వాల్ (101) సెంచరీలతో కదం తొక్కారు. ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్, జోష్ టంగ్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం భారత్ 6 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించనుంది. మ్యాచ్ ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉండటంతో ఫలితంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# రెండు గోల్స్‌తో మెరిసిన సుఖ్‌జీత్.. హాకీ ప్రో లీగ్‌లో టీమిండియా బోణీ..!



యూరప్ గడ్డమీద జరుగుతున్న ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ (FIH Pro League)లో భారత పురుషుల జట్టు నిరీక్షణ ఫలించింది. వరుసగా ఆరు పరాజయాలకు చెక్ పెడుతూ హర్మన్‌ప్రీత్ సింగ్ సేన బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెల్జియంపై 43తో గెలుపొందింది. ఆతిథ్య జట్టుతో ఉత్కంఠగా సాగిన పోరులో స్ట్రయికర్ సుఖ్‌జీత్ సింగ్ (Sukhjeet Singh) రెండు గోల్స్‌తో రాణించగా.. అమిత్ రొహిదాస్ ఒక గోల్‌తో మెరిశాడు. దాంతో, లీగ్‌ను టీమిండియా చిన్నపాటి సంతృప్తితో ముగించనుంది. అయితే.. మహిళల జట్టు మాత్రం బెల్జియం చేతిలో 02తో చిత్తుగా ఓడింది. హాకీ ప్రో లీగ్‌లో నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా చేతిలో రెండుసార్లు ఓడిన భారత జట్టు.. ఆదివారం పట్టుదలగా ఆడింది. తొలి అర్ధ భాగం 8 వ నిమిషంలో బెల్జియం ఆటగాడు అర్థర్ డి స్లూవర్ గోల్ కొట్టాడు. వందో మ్యాచ్ ఆడుతున్న భారత స్ట్రయికర్ సుఖ్‌జీత్ 21 నిమిషంలో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి బంతిని పంపడంతో స్కోర్లు సమం అయ్యాయి. అయితే .. 34 వ నిమిషంలో థిబ్యా స్టాక్‌బ్రొయెక్ గోల్ చేసిన ఆనందంలో ఉన్న బెల్జియానికి సుఖ్‌జిత్ షాకిస్తూ రెండో గోల్ అందించాడు. అనంతరం 41 నిమిషంలో ప్రత్యర్థి గోల్ చేయగా.. అమిత్ రోహిదాస్, హర్మన్‌ప్రీత్ కీలక గోల్స్‌తో జట్టు అద్భుత విజయంలో భాగమయ్యారు.

# వెటరన్ మాథ్యూకు స్వర్ణం..

## తొలి రోజే భారత్‌కు నాలుగు పతకాలు

పారా పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్‌లో భారత బృందం బోణీ అదిరింది. ఒకటి కాదు రెండు కాదు తొలిరోజే ఏకంగా నాలుగు పతకాలు కొల్లగొట్టారు లిఫ్టర్లు. బీజింగ్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో ఒక పసిడి, ఒక రజతం.. రెండు కాంస్యాలతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. వెటరన్ లిఫ్టర్ జాబీ మాథ్యూ ( Joby Mathew) అత్యుత్తమ ప్రదర్శనతో భారత్ ఖాతాలో పసిడి చేరింది. తొలి ప్రయత్నంలో విఫలమైన మాథ్యూ.. వరుసగా 145, 150 కిలోలు ఎత్తి స్వర్ణం గెలుపొందాడు. ఆదివారం ఆరంభమైన పోటీల్లో లిఫ్టర్ గుల్ఫమ్ అమీద్ దేశానికి తొలి పతకం అందించాడు. పురుషుల 59 కిలోల విభాగంలో 145 కిలోలు ఎత్తిన అతడు మూడో స్థానంలో నిలిచి కంచు మోత మోగించాడు. అనంతరం 72కిలోల కేటగిరీలో రెట్టించిన ఉత్సాహంతో పోటీపడిన రాముభాయ్ బంభవ తొలి ప్రయత్నంలోనే 151 కిలోలు ఎత్తాడు. తదుపరి రెండు దఫాల్లో వరుసగా 155 కిలోలు, 156 కిలోలు ఎత్తినా వాటిని పరిగణించలేదు. అయినా సరే అతడికి కాంస్యం దక్కింది. చైనా ఆతిథ్యమిస్తున్న పారా వరల్డ్ కప్‌లో 40 దేశాలకు చెందిన లిఫ్టర్లు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో సత్తా చాటినవాళ్లకు వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ 2026, పారాలింపిక్స్ 2028 బెర్తులు దక్కుతాయి. అందుకే.. శక్తినంతా కూడదీసుకొని మరీ భారీ బరువులు ఎత్తేందుకు సిద్ధమయ్యారు లిఫ్టర్లు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com